
ప్రజాశక్తి

సోమవారం 4 ఆగస్టు 2025 8 పేజీలు


గుంటూరు


పల్నాడు

స్మార్టు మీటరుతో విద్యుత్ షాక్



జులై నెలలో వచ్చిన బిల్లు రూ.52,145

- తాగునీటి వ్యాపారికి రూ.52 వేలు బిల్లు
- నాలుగు నెలల్లో దశలవారీగా పెరుగుదల
- 300 శాతం అధిక భారం
- బెంబేలేత్తుతున్న వ్యాపారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విద్యుత్ పంపిణీ సంస్థలు అమరుస్తున్న స్మార్టు మీటర్ల వల్ల విద్యుత్ బిల్లులు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ మీటర్లు అమర్చడం వల్ల వాణిజ్య సంస్థలకు బిల్లులు భారీగా వస్తున్నాయి. ఇందుకు నిదర్శనంగా గుంటూరు పశ్చిమ మండలం గోరంట్లలో నిర్వహిస్తున్న ప్యూరీఫైడ్ డ్రింకింగ్ వాటర్ పథకానికి జులైలో విద్యుత్ బిల్లు రూ.52 వేలు వచ్చింది. మే 27న స్మార్టు మీటరు ఏర్పాటు చేయగా రెండు నెలల నుంచి పెరుగుదల కన్పిస్తుందని వినియోగదారుడు పత్తి శ్రీనివాసరావు తెలిపారు. ఏప్రిల్‌లో పాత మీటరుకు రూ.13,099, మే నెలలో రూ.14,443 బిల్లు రాగా జూన్‌లో రూ. 20,302 బిల్లు రాగా జులైలో ఏకంగా రూ.52 వేలు రావడంతో వినియోగదారుడు ఖంగు తిన్నాడు. ఈ విషయంపై విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడు లేరు. తమ మీటరులో ఏమీ తేడా లేదని అధికారులు చెబుతున్నారు. గతంలో ఎన్‌టిఆర్ సుజల పథకం ద్వారా ప్రతి ఇంటికి రూ.2 తాగునీటి క్యాన్ సరఫరా నిమిత్తం గోరంట్ల పంచాయతీ వారు రక్షిత ప్యూరిఫైడ్ నీటిని అందించేందుకు పత్తి లక్ష్మయ్య చారిటబుల్ సొసైటీ పేరుతో నీటి సరఫరాకు పంచాయతీ ద్వారా అనుమతి పొందారు. తరువాత ఈ పంచాయతీ కార్పొరేషన్‌లో


తాడేపల్లి సుందరయ్యనగర్‌లో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

విలీనం అయిన తరువాత కూడా ఈపథకం కొనసాగుతోంది. క్యాన్ రూ.5కి మాత్రమే సరఫరా చేస్తుండగా ఆకస్మికంగా విద్యుత్ బిల్లు అధికంగా రావడంతో తమ పథకం కొనసాగించలేమని తమకు రాయితీ ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులను కోరినా వారు పట్టించుకోలేదు. ఆదాని స్మార్టు మీటరు వల్లే తమకు బిల్లులు భారీగా పెరుగుతున్నాయని శ్రీనివాసరావు సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూటరీ కంపెనీ చైర్మన్‌కు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినా అధికారులు విచారించి మీటరులో పొరపాటు లేదన్నారు. అయితే ఒక్కో నెలకు బిల్లులు భారీగా రావడంపై మాత్రం అధికారులు నోరుపెదపడం లేదు. మరో వైపు స్మార్టు మీటర్ల విద్యుత్ బిల్లులు 200 శాతం వరకు అధికంగా వస్తున్నాయని పలువురు వ్యాపారులు వాపోయారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన అదనపు ఛార్జీలను కొనసాగిస్తూనే స్మార్టు మీటర్లతో అధిక రీడింగ్ నమోదు అవుతున్నా పట్టించుకునే నాథుడు లేరు. కొన్ని మీటర్ల నాణ్యత లోపం వల్ల కూడా అధిక రీడింగ్ నమోదు అవుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నట్టు విద్యుత్‌శాఖ సిబ్బంది చెబుతున్నారు. అయితే మీటర్ల లోని

2లో


పులిచింతల డ్యాం వద్ద పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

నిండిన పులిచింతల జలాశయం

సాగర్ డ్యామ్ క్రస్ట్ గేట్ల మూసివేత - ప్రకాశం బ్యారేజికి తగ్గిన వరద ప్రవాహం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/ విజయపురి సౌత్



డెల్టాకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందించే పులిచింతల జలాశయం ఈ ఏడాది జులై చివరి వారంలోనే నిండింది. పులిచింతల నిర్మాణం పూర్తయిన తరువాత గత 12 ఏళ్ల కాలంలో జులైలో ..జలాశయం నిండటం ఈ ఏడాది తొలిసారి అని అధికారులు తెలిపారు. పులిచింతల గరిష్ట నీట్టి నిల్వ 45.77 టిఎంసిలు కాగా ఆదివారం సాయంత్రంకు 43 టిఎంసిల నిల్వ చేరింది. దీంతో ఎగువ వచ్చిన నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతలకు ఎగువ నుంచి ప్రస్తుతం 21,338 క్యూసెక్కులు వస్తుండగా 19వేలు క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. మరో వైపు ప్రకాశం బ్యారేజికి వరద ప్రవాహం తగ్గింది. ఆదివారం 1,94,772 క్యూసెక్కుల నీరు వస్తుండగా అదే స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే నాగార్జున సాగర్‌కు శ్రీశైలం నుంచి వచ్చే ప్రవాహం కూడా తగ్గింది. శ్రీశైలం నుంచి లక్షా ఐదు వేల క్యూసెక్కులు దిగువకు వస్తుంది.

2లో


మాట్లాడుతున్న సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్

రేపు స్మార్ట్‌మీటర్లు, ట్రూఅప్ ఛార్జీలకు నిరసన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఒడ్డు దాటే వరకు ఓడ మల్లన్న ఒడ్డు దాటాక బోడి మల్లన్న సామెత మాదిరి కూటమి పాలన ఉందని సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్ విమర్శించారు. వామపక్షాలు, ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 5న అన్ని విద్యుత్ సబ్ స్టేషన్లు, సచివాలయాల వద్ద చేపట్టనున్న ధర్నా జయప్రదం చేయాలని కోరుతూ నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివ కుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో వామపక్షాలు, ప్రజా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో విజయ్ కుమార్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ద్వంద్వ వైఖరిపై మండిపడ్డారు. గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించే ప్రతిపాదన విరమించు కోవాలని వామపక్షాలు, ప్రజా సంఘాలు ప్రజలు పోరాటాలు చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయన్నారు. గత వైసిపి హయాంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండని ప్రతిపక్షంలో ఉండగా నేటి మంత్రి నారా లోకేష్ ప్రజలకు పిలుపునిచ్చారని,

2లో

ఉద్యాన పంటల సాగుకు రాయితీలు

ఆయిల్ ఫాం సాగుకు ప్రోత్సాహం - ప్రజాశక్తితో జిల్లా ఉద్యాన అధికారి ఇంటూరి వెంకట్రావు



8లో

వలస కార్మికుల పిల్లల సంఖ్యపై అయోమయం

8లో

ప్రజల పాలిట ఉరితాళ్లు స్మార్ట్ మీటర్లు

5లో


మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ

కార్పొరేట్లకు భూములు ధారాదత్తం

ప్రజాశక్తి- తాడేపల్లి

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్పొరేట్లకు విలువైన భూములను కారు చౌకగా ధారాదత్తం చేయడం మాని, చిత్తశుద్ధితో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ కోరారు. ఆదివారం రాజధాని డివిజన్ కమిటీ సమావేశం ఉండవల్లి సెంటర్ పార్టీ కార్యాలయంలో కుంభ ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడారు. రాజధాని అమరావతిలో ప్రభుత్వ అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం 63 కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ సంస్థలకు భూములు కేటాయించగా ఇప్పటికీ 55 సంస్థలు రాజధాని అమరావతిలో తమకు ఇచ్చిన భూములలో ఇంతవరకు అసలు నిర్మాణ పనులే ప్రారంభించలేదని విమర్శించారు. నాలుగు సంస్థలు నిర్మాణ పనులు ప్రారంభించగా, మరో నాలుగు సంస్థల్లో మాత్రమే నిర్మాణ పనులు పూర్తయ్యాయని అన్నారు. నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభించిన సంస్థలు ఎప్పుడు పనులు ప్రారంభిస్తాయి, ఎప్పటి లోపు పూర్తి చేస్తాయో ఈ అంశాలపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందో తెలపాలని డిమాండ్ చేశారు. రాజధాని రైతులకు ఇచ్చిన

2లో

'రాజధాని' హామీలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలి

సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి నిర్మాణానికి భూములను త్యాగం చేసిన రైతుల ఆవేదనను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం రాజధాని నిర్మాణాలతో పాటు, రైతుల రిటర్నబుల్ ప్లాట్లను యుద్ధప్రాతిపాదికన అభివృద్ధి చేయాలని సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ కోరింది. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి ఆదివారం తుళ్లూరులో మాట్లాడారు. రాజధానికి భూములిచ్చి 11ఏళ్ళు గడుస్తున్నా, నేటికీ రైతులకు ఇచ్చిన నివాస, వాణిజ్య ప్లాట్లలో మాస్టర్ ప్లాన్‌లో పేర్కొన్న విధంగా అభివృద్ధి జరగలేదన్నారు. 9.14 అగ్రిమెంట్లో చేసుకున్న ఒప్పందం ప్రకారం మూడు సంవత్సరాల కాలపరిమితిలో ప్లాట్లు అభివద్ధి చేసి రైతులకు అప్పగిస్తామని చెప్పి ఆ ప్లాట్ లలో ఇప్పటివరకు అభివృద్ధి చర్యలు చేపట్టకపోవడం పట్ల రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని రవి అన్నారు. ప్రభుత్వం రెండో విడత భూ సమీకరణ పేరుతో రోజుకొక ప్రకటన చేస్తుండటంతో రాజధాని లోని రైతాంగం, ప్రజలు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని అన్నారు. అమరావతి ఉద్యమం కారణంగా తమపై పెట్టిన అక్రమ కేసులను సైతం ఎత్తివేయలేదని రైతులు ఆవేదనకు గురవుతున్నారని రవి చెప్పారు. తమ ప్లాట్లల్లో ఎటువంటి అభివృద్ధి చేయలేదని, దీంతో రుణం ఇచ్చేందుకు బ్యాంకర్లు వెనుకాడుతున్నారని, ఇటువంటి నేపథ్యంలో మరో విడత భూ సమీకరణకు ప్రభుత్వం ఎందుకు తొందర పడుతుందని రైతులు అడుగుతున్న ప్రశ్నలకు పాలకులు స్పష్టమైన సమాధానాలు చెప్పాలని రవి కోరారు. గ్రామ కంఠాల సమస్య తేల్చమని రైతులు పదే పదే ప్రభుత్వాన్ని ,సి ఆర్ డి ఎ అధికారులను కోరుతున్నా పరిష్కారం చేయ కుండా కాలయాపన చేయటం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, సి ఆర్ డి ఎ కాంపిటెంట్ అథారిటీలు,ఇతర కార్యాలయాలలో కొందరు అధికారులు డబ్బులు ఇవ్వనిదే పనిచేయడం లేదని రైతులు, ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నా ప్రభుత్వం పట్టించు కోదా.. అవినీతిపరుల పైన చర్యలు తీసుకోదా అని రవి ప్రశ్నించారు..? రైతులు ఇచ్చిన జరీబు భూములకు ఇటీవల వరకు జరీబు ప్యాకేజీ ఇచ్చి, ఇప్పుడు మెట్ట పేరుతో కౌలు తగ్గించి ఇవ్వడం విడ్డూరంగా ఉందని, అప్పుడు జరీబు.. ఇప్పుడు మెట్ట ఎలా అయ్యిందో అధికారులు వివరణ ఇవ్వాలని కోరారు. సాంకేతిక కారణాలని సాకుగా చూపుతూ వేల మంది రైతులకు వార్షిక కౌలు నిలిపివేశారని, కౌలు చెల్లించమని అడుగుతున్న రైతుల పట్ల అధికారులు స్పందిస్తున్న తీరు ఏమాత్రం బాగోలేదని, కుంటిసాకులు చెప్పటం మాని వెంటనే రైతులకు కౌలు జమ చేయాలని రవి డిమాండ్ చేశారు. రాజధానిలోని పేద, ఇతర వర్గాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని,నర్సరీల పునరుద్ధరణ, యువతకు రూ 25 లక్షల రుణ సదుపాయం కల్పించాలని,రెండో విడత టిడ్కో ఇళ్ల నిర్మాణం,ఉచిత విద్య, వైద్యం తదితర హామీలు సక్రమంగా అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

స్మార్టు మీటరుతో విద్యుత్ షాక్

(మొదటి పేజీ తరువాయి)

లోపాలపై ఇప్పుడే ఏమీ మాట్లాడవద్దని ఉన్నతాధికారుల నుంచి దిగువ స్థాయి సిబ్బందికి మౌఖిక ఆదేశాలు వచ్చినట్టు తెలిసింది. వైసిపి హయంలో అమలు చేసిన 36 నెలలు ట్రూ అప్ ఛార్జీల బాదుడు ముగిసిందని, కానీ తరువాత అమలులోకి వచ్చిన ఎఫ్‌టిపిపి పేరుతో అదనపు బాదుడు వరుసగా నాలుగేళ్ల వసూళ్ల పర్వం కొనసాగుతుందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. 2024, 2025లో చెల్లించిన బిల్లులకు కూడా మళ్లీ అదనపు భారం (ఎఫ్‌టిపిపి) వసూలు కొనసాగించడం వల్ల కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడుతోంది. గత ప్రభుత్వం అదనపు ఛార్జీల భారం వేసినప్పుడు బాదుడే...బాదుడు పేరుతూ ఊరూర కార్యక్రమం నిర్వహించిన టిడిపి ఇప్పుడు గత ప్రభుత్వ విధానాలను యథాతథంగా కొనసాగించడం విమర్శలకు దారితీస్తోంది.

రేపు స్మార్ట్‌మీటర్లు, ట్రూఅప్ ఛార్జీలకు నిరసన

(మొదటి పేజీ తరువాయి)

వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టి, ట్రూఅప్, అదనపు ఛార్జీల పేరుతో ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేస్తామని నాడు టిడిపి, జనసేన, బిజెపి కూటమి నేతలు ప్రజలకు హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక అవే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ట్రూ అప్, అదనపు విద్యుత్ ఛార్జీలు పెంచారని, ప్రభుత్వం మారినా ప్రజలపై భారాలు ఆగలేదన్నారు. స్మార్ట్ మీటర్లు వలన ప్రజలపై ఎటువంటి భారాలు పడవని ఎపిఇపిడిసిఎల్ సిఎండి ద్వారా ప్రకటన చేయిస్తున్నారని వీటివలన ప్రజలకు నష్టం లేకపోతే ప్రతిపక్షంలో ఉండగా ఎందుకు వ్యతిరేకించారని ప్రశ్నించ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా స్మార్ట్‌మీటర్లు, పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ ఇంటికి పెట్టడానికి అంగీకరిస్తే పులి బోనులో తలపెట్టినట్లేనన్నారు. 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ ఉద్యమ ఫలితాన్ని గుర్తు చేసుకోవాలని గుర్తు చేసుకోవాలని హెచ్చరించారు. ఏఐటియుసి నాయకులు ఉప్పలపాటి రంగయ్య, ఎంసిపిఐయూ జిల్లా కార్యదర్శి రెడ్ బాషా మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని రద్దుకు జరుగుతున్న ఆందోళనలలో ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అదానీ లాభాల కోసం ప్రజలెందుకు బలికావాలి", స్మార్ట్ మీటర్లు, అదనపు ఛార్జీలు వేయడంలో వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు ఒకటేనన్నారు. స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ పేరుతో నిలువు దోపిడీ చేయడం తగదన్నారు. స్మార్ట్ మీటర్ల ప్రక్రియ విరమించుకుని ప్రస్తుత మీటర్లను కొనసాగించాలని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెంచిన ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని స్మార్ట్ మీటర్లు బిగించే ఆలోచనలు విరమించే వరకు పోరాటాలు, ఉద్యమాలు, నిరసనలు ఆపే ప్రసక్తే లేదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. సింగిల్ ఫేజ్ మీటరుకి రూ 8927 వేలు, త్రీఫేజ్ మీటరుకు రూ 17,286 వేలు 93 వాయిదాలలో ప్రతినెల చెల్లించాలన్నారు. ప్రజలపై రూ 25 వేల కోట్ల అదనపు భారం పడుతుందన్నారు. విద్యుత్ రంగం ప్రభుత్వ ఆధీనంలో ఉంటే ప్రశ్నించగలమని అదానీ పరమైతే జవాబుదారులు ఉండరని తద్వారా జరిగే అనర్ధాలు, భారాలు వివరించారు. కార్యక్రమంలో సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయులు నాయక్, రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, వివిధ సంఘాల నాయకులు సిలార్ మసూద్, సయ్యద్ రబ్బాని, కొమ్ముల నాగేశ్వరరావు, నాగమ్మ భాయ్, పెద్దిరాజు, మస్తాన్రావు, బోస్, రాంబాబు, కరీం, జిలాని మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు భూములు ధారాదత్తం

(మొదటి పేజీ తరువాయి)

రిటన్బుల్ ప్లాట్ లలో అభివృద్ధి పనులు ఎప్పుడు ప్రారంభిస్తా రో తెలపాలని కోరారు. వీటిపై శ్రద్ధ పెట్టకుండా రాజధాని అమరావతికి మరో విడత 42 వేల ఎకరాలు భూ సమీకరణ చేస్తామంటూ , మొత్తం లక్ష ఎకరాలు కావాలంటూ ప్రభుత్వం చేస్తున్న హడావిడ కి అర్థం లేదని ఎద్దేవా చేశారు. రాజధానిలో 55 సంస్థలు అసలు నిర్మాణ పనులే ప్రారంభించక పోతే ఉపాధి అవకాశాలు ఎలా దొరుకుతాయని ప్రశ్నించారు. రాజధాని అమరావతిలో కేంద్ర ప్రభుత్వ సంస్థలకు కేటాయించిన భూములలో నిర్మాణ పనులు ఎందుకు చేపట్టడం లేదని నేతాజీ నిలదీశారు. నిర్మాణ పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తే ఆయా సంస్థలకు కేటాయించిన భూముల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని నేతాజీ హెచ్చరించారు. మరో ప్రక్క కరేడు భూములు బలవంతంగా తీసుకోవద్దంటూ ఆందోళన చేస్తున్న రైతులను వేధించడం, గిరిజన మహిళలను సైతం వదలకుండా జైళ్లకు పంపించడం దుర్మార్గమని మండిపడ్డారు. విజయవాడ పాత బస్టాండ్ విలువైన స్థలాన్ని , విశాఖలో మధురవాడ ఇలా అనేక ప్రాంతాలలో ప్రభుత్వ భూములు, విలువైన స్థలాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించటం వల్ల అభివద్ధి జరగదని, ఉపాధి, విద్య, వైద్యం, వ్యవసాయం అభివృద్ధి చేయటం ద్వారా, పేదలకు భూములు పంచడం ద్వారానే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రజలు పెరుగుతున్న బారాలతో ప్రభుత్వం పై తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారని, అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచము, అని చెప్పి మాట తప్పి అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారాలను మోపుతున్నారని విమర్శించారు. ఇవి చాల వన్నట్లుగా స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజల జేబులు కొల్లగొట్టాలని చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని, వీటి అన్నిటి పై ప్రజలు ఆందోళన చెందుతుంటే, ఇవేమీ పట్టించుకోకుండా ప్రజా సమస్యలను గాలికి వదిలేసి పాలకులు కార్పొరేట్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య లు పరిష్కారం అయ్యేవరకు ప్రజలను సమీకరించి సిపిఎం శ్రేణులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, డివిజన్ నాయకులు టీ బక్కి రెడ్డి, ఎం భాగ్యరాజు,జె నవీన్ ప్రకాష్,పేరం బాబురావు, గైరబోయిన నాగేశ్వరరావు, అత్తలూరి వీర వెంకయ్య,పార్వతి, కె రామకృష్ణ, షేక్ ఖాదర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

నిండిన పులిచింతల జలాశయం

(మొదటి పేజీ తరువాయి)

దీంతో సాగర్ జలాశయంకు కూడా నీటి ప్రవాహం తగ్గడంతో ఆదివారం మధ్యాహ్నం నాగార్జునసాగర్ డ్యామ్ క్రస్ట్ గేట్లను ఎన్ఎస్పీ అధికారులు మూసివేశారు. ఉదయం 18 గేట్ల ద్వారా కొనసాగిన నీటి విడుదల ఒక్క సారిగా వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో గేట్లను ఎన్ఎస్పీ అధికారులు ఒక్కొక్క గేటును మూసివేస్తూ మధ్యాహ్నానికి పూర్తిగా మూసివేశారు. శ్రీశైలం జలాశయం జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 63,580 క్యూసెక్కుల వరద నీరు సాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు.దీనితో నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 586.00 అడుగులవద్ద నీరు నిల్వవుంది.డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 300.32టీఎంసీల నీరు నిల్వ ఉంది.ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 28,926 క్యూసెక్కుల నీటిని,కుడి కాలువ ద్వారా 8604 క్యూసెక్కుల నీటిని,ఎడమ కాల్వద్వారా 8022 క్యూసెక్కుల నీటిని ,ఎస్.ఎల్.బి.సి ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని,లోలేవల్ కెనాల్ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.రిజర్వాయర్ నుండి మొత్తం 47,552 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పర్యాటకుల నిరాశ

నాగార్జునసాగర్ డ్యాం అందాలను చూడడానికి వచ్చిన పర్యాటకులకు నిరాశే మిగిలింది.ఆదివారం మధ్యాహ్నానికి గేట్లను మూసివేయడం పర్యాటకులు నిరాశతో వెనుతిరిగారు. ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు భారీ ఎత్తున తరలివచ్చారు నాగార్జునసాగర్ ఎటు చూసినా పర్యాటకులతో జనసంద్రంగా మారింది.ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో , లాంచీస్టేషన్, డ్యామ్ పరిసరాలు పర్యాటకులతో నిండిపోయాయి. ఆంధ్ర తెలంగాణ టూరిజం కష్ణానదిలో ఏర్పాటు చేసిన లాంచీలో జాలీ ట్రిప్పునకు, నాగార్జునకొండకు వెళ్లేందుకు పర్యాటకులు ఆసక్తి కనబర్చారు.

భారీగా ట్రాఫిక్ జాం

నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో డ్యామ్ అందాలు చూసేందుకు పర్యాటకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. దీంతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. నీటి ప్రవాహాన్ని చూసేందుకు వచ్చిన పర్యాటకులు తమ వాహనాలు ఆపేస్తుండటంతో నాగార్జునసాగర్ వంతెన వరకు రోడ్డుపై ట్రాఫిక్ జాం అయ్యింది. దీంతో 2 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. తెలంగాణ వైపు నుండి నూతన వంతెన వరకు వాహనాలు భారీగా రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.నూతన వంతెన వద్ద కిలో మీటర్ మేర ట్రాఫిక్ మరింతగా పెరిగింది. మెయిన్ రోడ్డు పక్కనే వాహనాలు నిలిపడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలుగుతుంది తెలంగాణ ఆంధ్ర. పోలీసులు ఎప్పటికప్పుడు ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా భారీ బందోబస్తును నిర్వహించారు.

వినుకొండ- గుంటూరు 4 లైన్ల రహదారిగా మార్పు

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ నుంచి గుంటూరు వరకు ఏర్పాటు చేయనున్న నాలుగు వరుసల రహదారితో ఈ ప్రాంత అభివద్ధి, పారిశ్రామికీకరణకు ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సహకారంతో వినుకొండ నుంచి గుంటూరు వరకు నాలుగు లైన్ల రహదారి మంజూరైందని, ఈ రహదారి అభివృద్ధికి రూ.2,605 కోట్ల నిధులు మంజూరు చేయడానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం అట్టహాసంగా నిర్వహించిన శావల్యాపురం మండలం కారుమంచి సహకార సంఘం ఛైర్మన్, డైరెక్టర్ల ప్రమాణస్వీకారోత్సవానికి ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఛైర్మన్ గా గోపాళం శివప్రసాద్, డైరెక్టర్లుగా గద్దె వీరమస్తాన్ రావు, దారా రామకోటమ్మ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు పాలకవర్గాన్ని అభినందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కర్షకుల సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని జీవీ ఆంజనేయులు అన్నారు. నూతన పాలకవర్గం కారుమంచి సొసైటీని అభివద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండ- గుంటూరు రహదారి మనప్రాంత అభివద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని, పారిశ్రామిక అభివృద్ధి కూడా వస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, నాలుగైదు ఏళ్లు అయినా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేరని వైసీపీ నేతలంతా భావించారని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతో వైసీపీ నేతల గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయని పేర్కొన్నారు. మరో 20 ఏళ్ల వరకు వైసీపీకి అధికారం కనుచూపు మేరలో కనిపించడం లేదని, ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డికి నిద్ర కూడా పట్టడం లేదని ... దానికి కారణం సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడమేనని చెప్పారు. కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉండటంతో కేంద్రం సహకారం తీసుకుని ఏపీని అభివద్ధి పథంలో నడిపిస్తున్నారని వెల్లడించారు ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

కుమార్తె కనిపించలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి - నకరికల్లు

కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త భార్యను చంపిన సంఘటన నకరికల్లు శివారులోని దుప్పుల కొండ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్తెనపల్లి మండలం గార్లపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ రమేష్‌కు నరసరావుపేటకు చెందిన తోరటి మేరీ (29)తో ఆరేళ్ల కిందట వివాహం జరిగింది. వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో నాలుగు నెలల కిందట పెద్ద మనుషుల పంచాయతీ చేసి నరస రావుపేటలో కాపురం చేయాలన్నారు. శనివారం మధ్యాహ్నం బయటికి వెళదామని ద్విచక్ర వాహనంపై భార్యా భర్తలు ఇద్దరు బయలుదేరారు. ఆ తర్వాత మేరీ కనిపించకపోవడంతో ఆమె తల్లి తన కుమార్తె కనిపించడం లేదని నరసరావుపేట వన్ టౌన్‌లో ఫిర్యాదు చేసింది. సిఐ చరణ్ సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి ఆదివారం మృతదేహాన్ని అటవీ ప్రాంతంలో కనుగొన్నారు. సంఘటనా స్థలాన్ని నరసరావుపేట మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పి వెంకట రమణ పరిశీలించి వివరాలు సేకరించారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ చరణ్ తెలిపారు.

బెల్టుషాపులపై దాడి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

బెల్టు షాపులు పై ప్రోహిబిషన్ ఎక్సైజ్ శాఖ సిఐ నయనతార ఆధ్వర్యంలో బెల్టు షాపులపై దాడి చేశారు. మూడు షాపుల్లో 24 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎం రవీంద్రా తెలిపారు. ప్రత్తిపాడు మండలంలోని గొట్టిపాడుకి చెందిన రామినేని దినేష్ వద్ద 180 ఎంఎల్ గల ఎనిమిది సీసాలు, ఈదుల పాలెం గ్రామానికి చెందిన పెరికల సాగర్ వద్ద ఎనిమిది సీసాలు, వట్టిచెరుకూరు మండలంలోని చమల్లముడి చెందిన వరదల బాబు వద్ద ఎనిమిది సీసాలు స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రవీంద్ర బాబు తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడు గల్లంతు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మండలంలోని పర్యాటక కేంద్రమైన ఎత్తిపోతలలో యువకుడు ఈతకు వెళ్లి గల్లంతైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మిర్యాలగూడకు చెందిన సమీర్(16) తన స్నేహితుడుతో కలిసి ఎత్తిపోతలకు వెళ్ళాడు. ఈతకు దిగి నీటిలో కొట్టుకు పోయారు. ఎస్ఐ అశోక్ సంఘటనా స్థలానికి చేరుకొని సమీర్ మృతదేహం కోసం గజ ఈతగాళ్లతో గాలించారు. రాత్రి అవడంతో సమీర్ జాడ గుర్తించడం కష్టంగా మారింది.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు రోటరీ క్లబ్, శంకర్ నేత్రాలయం, అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక చాణక్య స్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిం చారు. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు చేస్తున్న సేవలు అమోఘం అన్నారు. శంకర్ నేత్రాలయంతో కలిసి ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయటం గొప్ప విషయం అన్నారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి పొన్నూరు పట్టణ పరిసర ప్రాంతానికి చెందిన 400 మంది హాజరు కాగా 139 మందికి ఉచిత శుక్లాల ఆపరేషన్ కొరకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూ రు అధ్యక్ష కార్యదర్శులు ఎంఎస్ గుప్తా, వీరయ్య, పి .రవీంద్రనాథ్, కే రామకృష్ణ, తోటభాను ఎం.ఎం. ఖుద్దూస్, డాక్టర్ రవి రాకేష్, ఎన్.బాలకష్ణ, ఆంజ నేయులు, రామారావు, బి.వి. చౌదరి బండారు పల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఈఎస్ఐ ఆసుపత్రి

పూర్తిగా పాడైపోయిన తలుపులు, ఫ్లోర్లు ... స్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్న వైనం

ఆసుపత్రి స్లాబ్ నుండి వర్షపు నీరు లీకేజీ... బిక్కుబిక్కుమంటు విధులు నిర్వహిస్తున్న సిబ్బంది



పెదకాకానిలోని ఈఎస్ఐ ఆసుపత్రి



పూర్తిగా పాడైపోయిన స్లాబ్

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలోని ఈఎస్ఐ ఆసుపత్రి శిథిలావస్థకు చేరుకుంది. దీని నిర్మాణం 1981లో చేపట్టారు. సుదీర్ఘకాలంగా లక్షలాదిమంది కార్మికులకు పొరుగు సేవలను అందించి ప్రత్యేక వైద్య సేవల కోసం విజయవాడ గుణదలలోని ఆసుపత్రికి రోగులను పంపి స్తుంటారు. మూడు దశాబ్దాలకు పైగా కార్మికులకు సేవలు అందించిన ఆసుపత్రి నేడు శిథిలావస్థలో ఉంది. తలుపులు, ఫ్లోర్లు పూర్తిగా పాడైపోయి కీటకాలకు ఆవాసాలుగా మారిం ది. స్లాబ్ పెచ్చులు విరిగి పడుతూ భయానక వాతావరణన్ని తలపిస్తుంది. రోజు సుమారు 50 నుండచి 100 మంది రోగులు వివిధ సేవల కోసం ఆసుపత్రికి వస్తుంటారు. వర్షాకాలంలో స్లాబ్ నుండి నీరు లీకవుతూ ఆసుపత్రి మొత్తం చిన్నపాటి చెరువులా మారుతుంది. ఆసుపత్రి భవనం కోసం జూన్‌లో బ్రిడ్డింగ్ జరిగినా నేటికీ ఏమాత్రం అడుగు ముందుకు పడలేదు. ఆసుపత్రి పరిస్థితి గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసకెళ్లగా తాత్కాలికంగా అద్దె భవనంలోకి ఆసుపత్రిని మార్చే ప్రక్రియను సిబ్బందికి అప్పజెప్పారు. అయితే దగ్గరలో ఆసుపత్రికి సరిపోయే భవనాలు లేకపోవడంతో ప్రస్తుతం పాతభవనంలోనే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతా ధికారులు తక్షణమే స్పందించి ఆసుపత్రిని తాత్కాలిక భవనంలోకి మార్చి నూతన ఆసుపత్రిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల గుర్తింపు



మాట్లాడుతున్న మండల విద్యాశాఖ అధికారి హలీం

ప్రజాశక్తి -మేడికొండూరు

మండల కేంద్రమైన మేడికొండూరు భవిత స్కూల్లో ఆదివారం అఖిల భారతీయ శిక్షా సమాగం ఐదో వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక అవసరాలు బాల బాలికలకు మెడికల్ అసెస్మెంట్ సమీక్ష సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి షేక్ అబ్దుల్ అలీమ్ పాల్గొన్నారు. సమగ్ర శిక్ష గుంటూరు వారి ఆధ్వర్యంలో 0 నుండి 18 సంవత్సరాల లోపు వయసు గల విద్యార్థులకు ప్రత్యేక అవసరాలు గల ఉచిత శరీరక అంగవైకల్యం నిర్ధారణ జరిగింది. భవిత స్కూలు ఉపాధ్యాయులు బి.సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను చులకనగా చూడకుండా వారు ఎంచుకున్న రంగాలలో రాణించే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు బిడ్డల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచుకొని వారిలో మనోధైర్యాన్ని నింపాలని సూచించారు. తాడికొండ నియోజకవర్గం స్థాయిలో జరిగిన కార్యక్రమంలో నాలుగు మండలాలు అయినా తుళ్లూరు తాడికొండ మేడికొండూరు ఫిరంగిపురానికి సంబంధించి 95 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఐఈ అధికారి ఎన్.శ్రీనివాసరావు, ఐఈడి స్పెషల్ ఎడ్యుకేషన్ జిల్లా అధికారులు రామ్మోహన్, సాజిదా బేగం, నియోజకవర్గంలోని పలు మండలాల భవిత స్కూలు ఉపాధ్యాయులు బి.సుబ్బారావు, ఎన్ ఎల్లమంద, జ్యోతి, ఎన్ విజయలక్ష్మి, తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన విలేకరుల శిక్షణా తరగతులు



విలేకరులనుద్దేశించి మాట్లాడుతున్న తహశీల్దార్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి -తెనాలిరూరల్

ఇన్వెస్టిగేషన్ జర్నలిజాన్ని అలవర్చుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క విలేకరిపై ఉందని తెనాలి మండల తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ సిఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల పునశ్చరణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ జర్నలిస్టుల కలం అన్యాయాలను ఎదిరించే ఆయుధంలా పనిచేయాలని అన్నారు. పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై జర్నలిస్టులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులు కలం దీపంలా వెలుగులు వెదజల్లాలన్నారు. ఇన్వెస్టిగేషన్ జర్నలిజం అలవర్చుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి విలేకరిపై ఉందని తెలిపారు. ఆలపాటి సురేష్‌కుమార్ మాట్లాడుతూ జర్నలిజం సమస్యలకు అంతిమ ప్రయోజనం కావాలన్నారు. రెండు రోజులు పాటు నిర్వహించిన పునశ్చరణ తరగతులు విజ్ఞానంతో పాటు విలేకరులు ఆచరించాల్సిన విధి విధానాలను తెలుసు కున్నారని తెలిపారు. అనంతరం గణేష్‌యూత్ అధ్యక్షులు వీరవల్లి మురళి ఎపియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు, తెనాలి అధ్యక్షుడు చందు సుబ్బారావు మాట్లాడారు. అనంతరం శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విలేకరులకు ధృవపత్రాలు అందజేసారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు బొల్లిముంత కృష్ణ మాస్టారు, ఆంధ్ర ప్రదేశ్ సిఆర్ మీడియా అకాడమీ కార్యదర్శి మణిరామ్, ఎపియుడబ్ల్యూజె పూర్వ కార్యదర్శి చందు జనార్ధన్, రాష్ట్ర కార్యదర్శి విద్యాధర మురళి, ఎపి ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఏచూరి శివ, జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎన్ మీరా, ఎం.గోపీచంద్, మార్కండేయులు, దీపాలసాయి, బి.మురళి, సిహెచ్‌సుధాకర్, శరత్ పర్యవేక్షిం చారు.

రెండో రోజు నిర్వహించిన తరగతుల వివరాలు

విలేకరులు నుంచి డెస్క్ ఏం కోరుకుంటుంది అన్న అంశాన్ని పశ్చిమ గోదావరి జిల్లా ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇంచార్జి దేవగల రామకృష్ణ వివరించారు. గ్రామీణ వార్తలు, కథనాలు అంశంపై సీనియర్ జర్నలిస్ట్ డి.సోమసుందర్ మాట్లాడారు. పత్రికాభాష, మెలకువలపై తూర్పుగోదావరి జిల్లా ఆంధ్రజ్యోతి డిప్యూటి న్యూస్ ఎడిటర్ బి.హెచ్.వి మంగేష్ వివరించారు. అనంతరం స్మార్ట్‌రిపోర్టింగ్ అనే ఆసక్తికర అంశంపై విజయవాడ విశాలాంధ్ర వర్కింగ్ ఎడిటర్ అక్షర రూపంలో తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న కలెక్టర్

క్షతగాత్రులను పరామర్శించిన బాపట్ల కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఒరిస్సా రాష్ట్రం నుండి బతుకుదెరువు కోసం బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొణిదెన గ్రామంలో సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో పనికి వచ్చిన వలస కార్మికులు క్వారీలో వాటిల్లిన ప్రమాదంలో 6గురు దుర్మరణం చెందారు. అయిదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిని నరసరావుపేట చికిత్స కోసం జిబిఆర్ హాస్పిటల్‌కు తరలించారు. జిబిఆర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను బాపట్ల కలెక్టర్ వెంకట మురళి ఆదివారం పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని హాస్పిటల్ అధినేత డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌ను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ 14 లక్షలు, తీవ్ర గాయాలపాలైన వారికి రూ.10 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ లక్ష ఎక్స్గ్రేషియా ఇచ్చేలా క్వారీ యాజమాన్యంతో మాట్లాడడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. దీనిపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడారనీ, క్వారీ యాజమాన్యం ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. మృతదేహాలను వారి స్వస్థలానికి తరలిస్తామని, క్షతగాత్రులకు పూర్తి స్థాయిలో కోలుకునే వరకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందిస్తామని అన్నారు. దీనికి సంబంధించి ఇరువురు రెవిన్యూ డివిజనల్ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

రైతుల సంక్షేమం టిడిపితోనే సాధ్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పొన్నూరు

రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్థానిక ఎమ్మెల్యే ధూళిపాల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. పొన్నూరు పట్టణంలోని పొన్నూరు మండల ప్రజా పరిషత్ (ఎంపీడీవో) కార్యాలయంలో నియోజవర్గ స్థాయి అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం ద్వారా మన పొన్నూరు నియోజకవర్గంలోనే 21567 మంది రైతు కుటుంబాలకు రూ. 13,96,66000ల నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం రైతులు సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతుందన్నారు. హామీలను నెరవేర్చడంలో నారా చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. పొన్నూరు నియోజకవర్గ కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేయిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

యెల్లినేడి రామస్వామి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక.కార్యదర్శ్ యెల్లినేడి రామస్వామి పుట్టినరోజు వేడుకలు ఆదివారం నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణంలోని రఘురామ్ నగర్ ప్రజావేదిక యెల్లినేడి రామస్వామి జన్మదిన టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ రామస్వామిచే కేక్‌కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మస్తాన్‌వలీ టిడిపి నాయకులు డి. నాగేశ్వరావు, నాగోతు శౌరయ్య, చౌట శ్రీనివాసరావు పచ్చా సుధీర్ పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి మాణిక్య వర ప్రసాద్

గుర్రం జాషువా లా ఛాంబర్స్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలో గుర్రం న్యాయవాదులు అప్ప రాజు అపర్ణాదేవి, పరిశపోగు, రాహుల్ అంబేద్కర్, కాకాని నాగేశ్వరరావు జాషువా లా చాంబర్స్ కార్యాలయాన్ని ఆదివారం మాజీ మంత్రి, సీనియర్ న్యాయవాది డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రారంభించారు. అనతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాకవి గుర్రం జాషువా పేరుతో అడ్వకేట్ ఆఫీస్ వినుకొండలో ప్రారంభించడం మంచి పరిణామం అని ఆయన తెలియజేశారు. సమావేశంలో వినుకొండ భారసోసియేషన్ అధ్యక్షులు మీసాల శ్రీనివాసరావు, పొట్లూరి సైదారావు, సిహెచ్ ఎల్ ఎన్ మూర్తి, కావూరి గోపీనాథ్, చాగంటి వీరాంజనేయ చౌదరి, దుగ్గపోగువిజయ్, ధూపాటి విజయ్, ముప్పాళ్ళ జ్ఞానేశ్వర్‌రావ్ వినుకొండబార్ న్యాయవాదులు హాజరయ్యారు. విశ్రాంత డిఐజి స్టాంప్స్ బాలస్వామి, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ గుండాల స్వెనోం, సంద్రపాటి సైదా, మారుతీ వరప్రసాద్ మహిళా న్యాయవాది రెడ్డి నాగపద్మ, వినుకొండ పట్టణంలోని ప్రముఖులు హాజరయ్యారు

ఎస్సీసెల్ అధ్యక్షులుగా యేసయ్య నియామకం

ప్రజాశక్తి - దుర్గి

పల్నాడు జిల్లా, దుర్గి మండలం యస్సీ సెల్ అధ్యక్షు లుగా మాచర్ల యేసయ్యను నియమిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. ఎం.యేసయ్య మొదటి నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ చలాకీగా ఉంటూ దుర్గి వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా మంచి పేరుని సంపాదించుకున్నారు. యేసయ్య మాట్లాడుతూ నా నియా మకానికి సహకరించిన పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొమ్ము చంద్రశేఖర్‌కు, నియోజకవర్గం పార్టీ నాయకులకు, దుర్గి మండల నాయకులకు, ముటుకూరు గ్రామ నాయకులకు, ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో ఎస్సీలను ఏకతాటి పైకి తీసుకొస్తానని ఎస్సీలకు సముచిత న్యాయం జరగాలంటే మళ్ళీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

5న విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసన



సంఘీభావం తెలుపుతున్న సిపిఎం నాయకులు



అమరావతి సదస్సులో మాట్లాడుతున్న సూరిబాబు, ఇతరులు



తాడేపల్లిలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

విద్యుత్ కార్యాలయాల వద్ద ఈనెల 5వ తేదీన నిరసన, ధర్నా చేపట్టనున్న సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆంజనేయ నాయక్ అన్నారు. స్థానిక పండరీపురం 2వ లైన్ లోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం పట్టణ విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ మా ఇంటికి ఆదాని స్మార్టు మీటర్లు వద్దని ట్రూ ఆఫ్, సర్దు బాటు చార్జీలను రద్దు చేయాలని, ఆదానిస్మార్ట్ మీటర్లు బిగింపు ఉపసంహరించాలని, సఖి ఒప్పందాన్ని, టైం ఆఫ్ డే విధానం రద్దు చేయాలని, విద్యుత్ వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఎం.రాధాకృష్ణ, విసికెపార్టీ నియోజకవర్గ అధ్యక్షులు వి. ముత్తయ్య, సీమాంధ్ర రాష్ట్ర శ్రేయస్సు సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్. అల్లాబక్షు మాట్లాడుతూ స్మార్ట్‌మెట్రో వ్యతిరేకంగా కమ్యూనిస్టులు చేస్తున్న పోరాటానికి తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చిలక లూరిపేట విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక కమిటీ కన్వీనర్ పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇది నిరంతర ఉద్య మం అన్నారు. గిరిజన సంఘాల రాష్ట్ర అధ్య క్షులు బి.శ్రీను నాయక్ మాట్లాడుతూ ఈ స్మార్టు మీటర్లకు వ్యతి రేకంగా ఉద్యమిస్తున్న ఐక్య వేదిక తమ పూర్తి మద్దతు ఉంటుం దన్నారు. ఈ నెల 5వ తారీఖున స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద గల శాఖ గ్రంధాలయం వద్ద ఉదయం 10గంటలకు నిరసన కార్యక్రమం ప్రారంభమౌతుందని, ఆనంతరం విద్యుత్ ప్రధాన కార్యాలయాల వద్ద ధర్నా ఉం టుందని తెలిపారు. ప్రజలు, హరిజన, గిరిజన, బడుగు, బలహీనవర్గ సంఘాల నాయకులు, రైతులు, కార్మికులు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. సాతులూరి బాబు, పి.భారతి, పి.శివ పార్వతి, కె.తాత్వీక, టి.ప్రతాపరెడ్డి, బి.సి. సంఘనాయకులు బి. లక్ష్మణ్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

వామపక్షాలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 5న విద్యుత్తు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం కార్యదర్శి బి సూరిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ప్రజాసంఘాల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై పాత బకాయిలు పేరుతో విద్యుత్ చార్జీలు పెంచి విపరీతంగా భారాలు వేస్తోందన్నారు. ఇప్పటికే రూ.15,485 కోట్ల భారం వేయడమే కాకుండా డిస్కములు, ట్రూ ఆఫ్‌చార్జీలు పేరుతో రూ.12,700 కోట్ల విద్యుత్ ఛార్జీలు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు డిస్కామ్‌కి లేఖ రాసిందని సూరిబాబు అన్నారు. విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ గృహ వినియోగదారుడు అనుమతి లేకుండా స్మార్ట్‌మీటర్ బిగించవద్దని ప్రకటించారనీ, అయితే ఇందుకు సంబంధించి జీవో జారీ చేయాలని సూరిబాబు డిమాండ్ చేశారు. గృహ వినియోగదారులు ఇళ్ల వద్ద లేని సమయం లో స్మార్ట్‌మీటర్లు బిగిస్తే పరిస్థితి విద్యుత్ ఏఈకి ఫిర్యాదు చేయాలని సూరిబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్తు చార్జీలు తగ్గించకపోతే మరో విద్యుత్తు బషీరాబాద్‌లా పోరాటం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుందని కూటమి ప్రభు త్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమా వేశంలో సయ్యద్ మొహుద్దీన్ వలి, పి.సత్యనారాయణ ఎస్.కే.రఫీ ఎస్కే. నాగుల్ మీరా, కే.ఏషియా కే.మధు తోకల సూరిబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి

అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించవద్దని పాత మీటర్లని కొనసాగించాలని పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని రైతు సంఘం నాయ కులు ఇంజన్ లింగయ్య అన్నారు. ఆదివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో పాత బస్టాండ్, 28వ వార్డు జండా చెట్టు ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఇళ్లకు వస్తున్నారని వారిని అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ స్మార్ట్ మీటర్లు ఇప్పటికే షాపులకు, పరిశ్రమలకు బిగించారనీ, ఈ స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల బిల్లులు విపరీతంగా పెరుగుతున్నాయని అన్నారు. విద్యుత్తు వాడుకునే డిమాండ్ ను బట్టి ఉదయం ఒక రేటు, మధ్యాహ్నం ఒకరేటు, సాయంత్రం మరొక రేటు ఇలా రేట్లు పెరుగుతాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డి.విమల, గుంటుపల్లి రజని, తుమ్మల లక్ష్మీ, గింజుపల్లి నాగలక్ష్మి, షేక్ సాయిబా, షేక్ సైదులు, వనమా రామారావు, జడ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ళ

స్మార్ట్ మీటర్లను ప్రజలందరూ వ్యతిరేకించాలనీ సిపిఎం మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ అన్నారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో ఆదివారం స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను ప్రజలు ఉద్యమంగా పోరాడి వ్యతిరేకించాలన్నారు. పేద ప్రజలపై భారాలు మోపేందుకు స్మార్ట్ మీటర్ల ను తీసుకువచ్చి ప్రభుత్వాలు అంబానీ,అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నారన్నారు.గత వైసీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు స్మార్ట్ మీటర్లకై మొగ్గు చూపుతోందన్నారు. ఆగస్టు 5వతేదీన మండల కేంద్రాల్లో జరిగే ధర్నాను ప్రజలందరూ కలిసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దాసరి అప్పారావు, కూరపాటి ప్రభాకరరావు, చింతపల్లి నాగమల్లే శ్వరరావు, తొండపి మస్తాన్‌రావు, ఇండూదూరి పెద్దిరెడ్డి, మలినేని నాగేశ్వరరావు, నాయుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి

ఆదానీ కంపెనీకి దోచి పెట్టటానికి టిడిపి ప్రభుత్వం విధానాన్ని వ్యతిరేకిస్తూ సీతానగరంలో ప్రజల నుండి చేపట్టిన సంతకాల సేకరణ లో మేరీ, కొండలు పాల్గొన్నారు. ముగ్గు రోడ్డులో స్మార్ట్ మీటర్లు వద్దంటూ సిపిఎం ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, లేనప్పుడు మరో మాట మాట్లాడటం పాలక పార్టీలకు అలవాటైందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ముగ్గురు రోడ్డు శాఖ కార్యదర్శి దర్శనపు విజయబాబు, మామిళ్ళ లీలమ్మ, గద్దల గోపమ్మ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, కొత్త భారాలను రద్దు చేయాలని తాడేపల్లి సుందరయ్య నగర్ ఆఫీసు సెంటర్‌లో జరిగిన గ్రూపు సమావేశంలో పలువురు డిమాండ్ చేశారు. చార్జీల భారం తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం, భారాలు పెంచి ప్రజలను మోసం చేస్తున్న తీరును వక్తలు వివరించారు. మీటర్లు పనిచేయడం లేదని అబద్ధాలు చెబుతూ స్మార్ట్ మీటర్ల వల్ల ఎదురయ్యే ఇబ్బందులను వివరించే కరపత్రాలు పంచి సంతకాలు సేకరించారు. సీపీఎం స్థానిక కార్యదర్శి గిరిజ, మహిళా సంఘం నాయకులు సుధ, విజయ, విజయలక్ష్మి, కుమారి, రత్న, ప్రసన్న, జయశ్రీ, సత్య, ఉష పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విద్యుత్ పంపిణీ విధానాన్ని ఆదానీ సంస్థకు అప్పగించే ప్రయత్నాన్ని ప్రతిఘటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి అన్నారు. విద్యుత్ పంపిణి అదానీ చేతుల్లోకి వెళితే ఎస్సి,ఎస్టి వినియోగదారులకు ఉచిత విద్యుత్తు రద్దవుతుందని తెలిపారు. గుడివాడ గ్రామంలో ఆదివారం రైతుల సంతక సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గున్నారు. రైతులు, పాల రైతులతో మాట్లాడారు. గతంలో విద్యుత్ మీటర్లు మార్చినప్పుడు వినియోగదారుల నుండి ఎటువంటి ఫీజులు వసూలు చేయలేదని తెలిపారు. స్మార్ట్ మీటర్ల పంపిణీ విధానానికి వ్యతిరేకంగా ఆగస్ట్ 5 నుంచి 7వ వరకు గ్రామ సచివాలయాల్లో వినతి పత్రాలు ద్వారా సమస్యను ముఖ్యమంత్రి కి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకర్, బి భాస్కరరావు, తురకా బాబు, బి పిచ్చయ్య, బి మార్కు, కె ప్రసాదరావు, పి పోలేసు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలుకు నోచని పొగాకు



మాట్లాడుతున్న కంచుమాటి అజయ్

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఫిరంగిపురం మార్కెట్ యార్డ్‌లో రేపూడి, గొర్ల వారి పాలెం, నుదురుపాడుకు చెంది నిల్వ ఉన్న పొగాకును రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ పొగాకు పంట చేతికొచ్చి ఐదు నెలలు గడవటం వల్ల రైతులు ఇంకా కొనుగోలుకు నోచుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రైతు సంఘం ఆందోళనతో రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన కొనుగోలు కేంద్రాలు నత్త నడకన నడవటం వలన ఇప్పటి వరకు గుంటూరు జిల్లాలో 2వేల మెట్రిక్ టన్నుల లోపు మాత్రమే కొనుగోలు జరిగిందన్నారు అధికారుల లెక్కలు ప్రకారం ఇంకా 8 వేలకు పైగా నెలవున్నట్లు అర్థమవుతోందన్నారు. సన్న, చిన్న కారు రైతులు కొనుగోలుకు ఆలస్యం కావడంతో ఎదురు చూడలేక ప్రైవేట్ కంపెనీలకు కారు చౌకగా అమ్ముకున్నారని తెలిపారు. గుంటూరు జిల్లాలో మార్క్ఫెడ్ ద్వారా ప్రారంభించిన కొనుగోలు సెంటర్లో సక్రమైన మార్గంలో లేకుండా వివిధ రకాల తప్పుడు ఆంక్షలతో కొనుగోలుకు వచ్చిన రైతుల పొగాకును వెనుకకు తిప్పి పంపించడంతో దిక్కుతోచక చిన్న చిన్న ప్రైవేటు కంపెనీలకు రూ.2000 లోపు అమ్ముకుంటున్నారని తెలిపారు. ఇది ప్రభుత్వానికి చాలా సిగ్గుచేటు అన్నారు. కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగానే రైతులుకు ఉపయోగపడు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కనీ వినిఎరుగని రీతిలో పొగాకును కొంటున్నామని ఆర్భాటంగా ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కానీ ఆచరణలో చూస్తే డొల్లతనంగా పొగాకు కొనుగోలు జరుగుతోందనీ, కొనుగోలు కేంద్రాల్లో ధర నిర్ణయించే క్వాలిటీ బైయర్ల్ రూ.12 వేలు ధర నిర్ణయించాల్సి ఉండగా కేవలం రూ.6వేలు మాత్రమే నిర్ణయిస్తున్నారనీ, దీని వల్ల సగానికి సగం పొగాకు రైతులు నష్టపోతున్నారని తెలిపారు. కొద్దిగా డ్యామేజ్ అయిన పొగాకును వెనక్కి తిరిగి పంపడం వలన రవాణా, మరలా గ్రేడింగ్ ఖర్చులు పెరిగిపోయి మూలిగే నక్క మీద తాటికాయ పడ్డటు రైతుల పరిస్థితి ఉందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఈనెల ఆరవ తేదీన గుంటూరులోని చుట్టగుంట సెంటర్‌లో ఉన్న రాష్ట్ర కమిషన్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ ధర్నాకు పొగాకు రైతులు కౌలు రైతులు, సన్నా,చిన్న కారు రైతులందరూ పాల్గొని నిరసన తెలియ జేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘం సిఐటియు నాయకులు వలి, రైతులు జీ.రంగయ్య, వి.సాంబయ్య, కే.శ్రీనివాస్ రెడ్డి, పోల్రాజు, నాగరాజు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.





చికాకానిలో ప్రచారం నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, ఫిరంగిపురం మండలంలో, మంగళగిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ప్రజల పాలిట ఉరితాళ్లు స్మార్ట్ మీటర్లు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

స్మార్ట్ మీటర్లు ప్రజల పాలిట ఉరితాలుగా మారిపోతున్నాయని, వెంటనే స్మార్ట్ మీటర్లు బిగించడం ఆపివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు.ఆదివారం చినకాకాని గ్రామంలో ప్రజా వేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లుపెట్టడం ఆపేయాలని, ట్రూప్ చార్జీని రద్దు చేయాలని కోరుతూ మంగళగవారం మంగళగిరి ఏఈ ఆఫీస్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చార్జీల పేరుతోటి మరోసారి 12700 కోట్ల రూపాయలు భారాన్ని ప్రజలపై వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కరెంటు చార్జీలు విపరీతంగా పెరిగి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని దీనికి తోడు రోకటి పోటు చందాన మరోసారి విద్యుత్ ఛార్జీలని పెంచుతూ నిర్ణయం సరైనది కాదని తెలిపారు. స్మార్ట్ మీటర్లను బిగించడం ఆపకపోతే ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మంగళగిరి రూరల్ మండల కార్యదర్శి జి. బాబు ప్రసాదు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కాజ శివశంకరావు, కౌలు రైతు సంఘం నాయకులు టి.బ్రహ్మయ్య, సిఐటియు నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఐదవ తేదీన ఏఈ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజానీకం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఫిరంగిపురం మండల ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని మేరికపూడి, నుదురుపాడు, రేపూడి, గొల్లపాలెం, వేములూరుపాడు, ఫిరంగిపురం, 113 తాళ్లూరు, తక్కెళ్లపాడు గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నటువంటి కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చినటువంటి వాగ్దానాన్ని విస్మరించి గత ప్రభుత్వాంసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని దానికి నిదర్శనమే ఈరోజు గ్రామాల్లో ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్లు బిగిస్తానని చెప్పడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని 5వ తేదీన జరిగే ధర్నాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు

ప్రజాశక్తి - మంగళగిరి

ఆదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దంటూ ఆదివారం స్థానిక కొత్తపేటలో సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి వి.వి.జవహర్‌లాల్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగిస్తే విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం పడుతుందని అన్నారు. కరెంటు ఎక్కువగా కాలే సమయంలో అదనంగా యూనిట్లకు వస్తువులు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్నాథం, కె.నాగేశ్వరావు, కె.వెంకటేశ్వరరావు, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి విద్యుత్ వినియోగదారులకు దగ్గరకు వెళ్లి సంతకాలు సేకరించారు.

4వ వార్డులో ప్రచారం

అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించ వద్దంటూ మంగళగిరి పట్టణంలోని ద్వారకా నగర్ నాలుగవ వార్డ్ లో సిపిఐ ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఆదివారం సంతకాల సేకరణ చేపట్టారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడం వలన విద్యుత్ వినియోగదారులపై అదనంగా భారం పెరుగుతుందని స్మార్ట్ మీటర్లను బిగించవద్దని ఆయన డిమాండ్ చేశారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో నాలుగో వార్డ్ శాఖ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, కోడూరు శివాజీ, పేరు పోయిన ముక్కంటి, బాపనపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలిరూరల్

స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలు అడుగడుగునా కష్టాలు, కడగండ్లు ఎదుర్కొంటున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం విద్యుత్ వినియోగదారుల ప్రజా వేదిక సదస్సు నిర్వహించారు. బాబుప్రసాద్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ద్వారా అడ్డగోలుగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని మండిపడ్డారు. వారాల తరబడి విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోవడం శోచనీయమన్నారు. స్మార్ట్ మీటర్లను మరమ్మతులు చేసే సిబ్బంది లేక విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. రైతు సంఘం నాయకులు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ పక్కనపెట్టి ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. జెవివి నాయకులు అహ్మద్ హుస్సేన్ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు షేక్ హుస్సేన్ వలి, పోస్టల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పి.జోనేష్, కె.లక్ష్మణరావు, ఎం.ఉమామహేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు జి.సుబ్బారావు, దాల్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.వెంకటసుబ్బయ్య, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి.రవీంద్ర, ఎస్.సుబ్రహ్మణ్యం, కె.శివశంకర రావు, కె.దుర్గాప్రసాద్, కటకం సాంబశివరావు, మహిళా సంఘం నాయకురాలు ఎన్.రాజ్యలక్ష్మి, వై.ఈశ్వరి, యం.సాంబశివరావు పాల్గొన్నారు.


ప్రజాశక్తి - చేబ్రోలు

విద్యుత్ భారాలు పెంచొద్దని, స్మార్ట్ మీటర్లను బలవంతంగా ఇళ్లకు బిగించవద్దని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో చేబ్రోలులోని చెన్నారెడ్డి కాలనీ, ఇందిరా కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ ఛార్జీల భారాలు తగ్గకపోగా మరింత పెరిగి వినియోగదారుల నడ్డి విరుస్తున్నాయని అన్నారు. స్మార్ట్ మీటర్లు వినియోగంలోకి వస్తే వినియోగాన్ని బట్టి కాకుండా మనం వాడే టయాన్ని బట్టి విద్యుత్ రేటు చెల్లించవలసి వస్తుందని ప్రజలకు తెలియజేశారు. అదానీ స్మార్ట్ మీటర్ పెట్టడానికి వచ్చే వారిని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, పి.హెచ్.హనుమంతరావు, నాయకులు చూడయ్యా, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి

ఆదాని మెప్పుకోసం కుటమి ప్రభుత్వం తీసుకొచ్చిన స్మార్ట్ మీటర్లు ప్రజలకు బాదుడే బాదుడు గుర్తుకు తీస్తుందని పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు చెప్పారు. సుందరయ్య నగర్‌లో ఆదివారం స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ వివిధ బజార్లలో ప్రచారం నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో బాదుడే బాదుడు అంటూ అధికార పక్షాన్ని ఇరుకునబెట్టిన నేడు అధికారం వెలగబెడుతున్న అధికార పార్టీ అదేవిధంగా అమలు జరుపుతుందని విమర్శించారు. మీటర్ల బిగింపు ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తానని హెచ్చరించారు. సందర్భంగా మహిళా శాఖ ఆధ్వర్యంలో జరిగిన కరెంటు బిల్లుల ప్రతులను తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్.గిరిజ, కె.ఉష, బొబ్బిలి రామారావు, కె.ప్రభాకర్, సుధా, కె.విజయలక్ష్మి, మహిళా సంఘం కార్యదర్శి జ్యోతి, సత్య, విజయ, ఉష, లక్ష్మి, అన్నపూర్ణ, అనసూయ, మహిదీప్ తదితరులు పాల్గొన్నారు.





తెనాలిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బాబుప్రసాద్, మంగళగిరిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు, తాడేపల్లి సుందరయ్య నగర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

234వ రోజుకు చేరిన ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 234వ రోజుకి చేరుకున్నాయి. దీక్షలను సిఐటియు నాయకులు వేములదుర్గారావు ప్రారంభించారు. దీక్షలో కె.స్టీవెన్, సుబ్బారావు, తుపాకుల నాగేశ్వరరావు, నవనీతం, దుర్గమ్మ కూర్చున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ ఎసిసి కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి చాలా నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. కార్మికవర్గం పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. గత ప్రభుత్వాలకు కొన్ని అనుభవాలు ఉన్నప్పటికీ, ఈ ప్రభుత్వం గత అనుభవం నుండి నేర్చుకున్నట్లు లేదని ఆయన అన్నారు. కార్మిక వర్గం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరివీడి, ఎసిసి సమస్యను వెంటనే పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశీర్వాదం, ఎన్.దుర్గా రావు, ఎస్.కె.బాషా, వై.సుబ్బారావు, ఇబ్రహీం పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు



నిరసన తెలియజేస్తున్న కార్మికులు

కార్మికుల సమస్యలను పరిష్కరించండి...

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న బదిలీ కార్మికులు, ఎం బుక్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మంగళగిరి కమిటీ ఆధ్వర్యంలో ఎం బుక్ కార్మికులు, బదిలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చెంగయ్య మాట్లాడుతూ కాంట్రాక్టర్ కార్మికుల వేతనాలను దోపిడీ చేస్తున్న విధానాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. వాస్తవంగా 15000 రూపాయలు వేతనం ఇవ్వాల్సి ఉండంగా కాంట్రాక్టర్ 5000 రూపాయలు తీసుకొని కార్మికులకు పదివేల రూపాయలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విధంగా నెలకు లక్షలాది రూపాయలు, సంవత్సరానికి కోటి రూపాయలు పైన దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. దీనిపై కార్పొరేషన్ అధికారులు దృష్టికి తీసుకు వళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో నిరసన కార్యక్రమం చేపట్టాల్సి వచ్చిందని అన్నారు. పండుగ రోజుల్లో కూడా సెలవులు ఇవ్వడం లేదని అన్నారు. పీఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనం కార్మికుల బ్యాంక్ అకౌంట్లో వేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కాంట్రాక్టర్ బెదిరింపులు

కాగా కాంట్రాక్టర్ నిరసన శిబిరం వద్దకు వచ్చి బెదిరింపులకు దిగారు. నిరసన తెలియజేసే హక్కు లేదని, సమ్మె చేయకూడదని బెదిరించారు. అయితే కార్మికులు బెదిరింపులకు లంగిపోకుండా సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, ఎస్.గణేష్, ఫెడరేషన్ నాయకులు పుణ్యవతి, సిఫార, రజిని, ఎయిమ్స్ వర్కర్స్ అండ్ యూనియన్ నాయకులు కె.బుజ్జిబాబు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పేరేచర్లలో సంతకాలు సేకరించిన సిపిఎం నాయకులు రామకృష్ణ

వ్యాపార సంస్థలకు బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలి

ప్రజాశక్తి - మేడికొండూరు

విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో ఇప్పటికే వ్యాపార సంస్థలకు బిగించిన మీటర్లను వెంటనే విద్యుత్ శాఖ అధికారులు తొలగించాలని సిపిఎం ఆధ్వర్యంలో పేరేచర్లలో ఆదివారం సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు బొట్ల రామకృష్ణ మాట్లాడుతూ అదాని సంస్థ వారి విద్యుత్ స్మార్ట్ మీటరును బిగించవద్దని, వ్యాపారం షాపులకు బిగించిన స్పాట్ మీటర్లను తొలగించాలని సిరిపురం, పేరేచర్ల వ్యాపారస్తులు సమిష్టిగా ముందుకు వచ్చి మీటర్ల తొలగించే వరకు ప్రతికటించాలన్నారు. మన రాష్ట్రంలో ప్రతి ఇంట్లోకి ఆదాని ప్రవేశించాడు అని అన్నారు. ఈ మీటర్ వలన రోజుకు మూడుసార్లు రేట్లు పెరుగుతూ రీడింగ్ అవుతాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఫిబ్రవరిలో 921, 923 నెంబర్ల ద్వారాగజిట్ చేసిందని తెలిపారు. మన విద్యుత్ సమస్యలు ఎవరికి విన్నవించాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంటుందన్నారు. అందువలన ఈ ప్రైవేటీకరణ నిలుపుదల చేయుటకు ఐదో తేదీ డోకిపర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జరిగే ధర్నాలో అన్ని గ్రామాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.



రోడ్డుపై ఏర్పడిన గుంతను చూపుతున్న వైసిపి నాయకులు

కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని పల్నాడు జిల్లా వైసీపీ కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శ్రీకష్ణ చిత్రాలయ థియేటర్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ, వినుకొండ రోడ్డను పరిశీలించారు. అనంతరం డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని రోడ్లపై ఉన్న గుంతలను పూర్తి స్థాయిలో ఎందుకు పూడ్చ లేదన్నారు. చిత్రాలయ థియేటర్ సమీపంలో రోడ్డు మరమ్మత్తుకు విడుదల చేసిన మున్సిపాలిటీ నిధులు రూ.38 లక్షలు ఏమయ్యాయన్నారు. బస్టాండ్ పరిసరాలలో పారిశుద్ధ్యం లోపించి, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. పారిశుద్ధ్య పనులలో అనేక లోపాలున్నాయనీ, రోడ్ల ఆక్రమణలతో పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆక్రమణలు తొలగించిన ప్రాంతంలో ఫుట్‌పాత్ నిర్మాణం ఎందుకు చేపట్ట లేదని అన్నారు. పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపడే వరకు గుడ్‌మార్నింగ్ నరసరావుపేట పేరుతో పర్యటిస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహమ్మద్ కలీమ్

ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ సమావేశం

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక ఎబిఎం కాంపౌండ్‌లోని సాధన ఇనిస్టిట్యూట్లో ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ నాయకుల ముఖ్య సమావేశాన్ని ఎం.ఎస్.కె బాషా అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు మహమ్మద్ కలీమ్ హాజరైమాట్లాడుతూ పార్లమెంటు వ్యవస్థను విశ్వసిస్తూ, ప్రజాస్వామ్య, లౌకికవాద విధానాలను అవలంబిస్తూ 29 సంవత్సరాలుగా ముస్లింల న్యాయమైన హక్కుల సాధన కొరకు ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ పని చేస్తోందని అన్నారు. ఎంయుఎఫ్ ను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నియోజకవర్గాల్లో కమిటీలను ఏర్పర్చి ముస్లిం సమాజంలో ముఖ్యంగా ముస్లిం యువ కులకు సామాజిక స్పృహతో పాటు రాజకీయ చైతన్యం కలిగించేందుకు త్వరలో కార్యాచరణ రూపొందించి, రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించేందుకు కృషి చేస్తు న్నామని అన్నారు. ఎంఎస్‌కె బాషా మాట్లాడుతూ తాను గత 15 సంవత్సరాలుగా ముస్లిం యునైటెడ్ ఫ్రంట్, ముస్లిం జేఏసీ సంఘాల్లో జనాబ్ మహమ్మద్ కలీం నేతృ త్వంలో క్రియాశీలకంగా బాధ్యతలు నిర్వహించాననీ, ఎంయుఎఫ్ నియోజకవర్గంలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం వినుకొండ నియోజకవర్గ ఎంయుఎఫ్ ఇన్చార్జిగా ఎంఎస్‌కె. బాషాను నియమించారు. సమావేశంలో ఎంయుఎఫ్ గుంటూరు ఈస్ట్ ఇన్చార్జి షేక్ గౌస్‌బాష, ఎన్ఎస్ఓ కరిముల్లా, పి షరీఫ్, ఎస్.కే లతీఫ్, షేక్ జానీ ,షేక్ మసూద్, గోల్డ్‌బాష, ఇస్లాంపేట కరీముల్లా పాల్గొన్నారు.

నాదెండ్ల ఇలాకాలో ....

నిర్లక్ష్యానికి గురవుతోన్న వికలాంగుల కాలనీ

- తాగునీటికి కటకట...రోడ్లు సైడ్ డ్రెయిన్స్ నిల్
- స్వచ్ఛందసంస్థలు సహకరించినా కనికరించని అధికారులు



రోడ్లు లేని కోపల్లె వికలాంగుల కాలనీ

ప్రజాశక్తి-తెనాలి

వారంతా వికలాంగులు.. వారి కోసమే ప్రభుత్వం ప్రత్యేకంగా కాలనీ ఏర్పాటు చేసింది.. కానీ వసతుల కల్పన విస్మరించింది. కనీసం తాగునీటి సౌకర్యం లేదు. అంతర్గత రోడ్లు, సైడు కాలువల ఊసేలేదు. ఏళ్ళ తరబడి అధికారుల చుట్టూ తిరిగి విసిగిన వారికి ఎట్టకేలకు ఓ స్వచ్ఛంద సంస్థ బాసటగా నిలిచింది. తాగునీటికి పైపులైన్, రెండు వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేసింది. దానికి విద్యుత్ సరఫరాకు అధికారులు నిరాకరించపోవడంతో వికలాంగుల కష్టాలు వర్ణనాతీతం. మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రాతినిధ్యం వహిస్తున్న తెనాలి మండలం కోపల్లె గ్రామంలో వికలాంగుల కాలనీ వాసుల కష్టాలిలా ఉన్నాయి.

వికలాంగుల హక్కు పోరాట సమితి ఆధ్వర్యంలో సుదీర్ఘ పోరాట ఫలితంగా 2016 అక్టోబరులో అప్పటి టిడిపి ప్రభుత్వం కోపల్లెలో దాదాపు 50 మంది వికలాంగులకు నివేశన స్థలాలు కేటాయించింది. వారితోపాటు అదే కాలనీలో అతి కొద్ది మంది పేదలకూ కేటాయించింది. గృహ నిర్మాణానికి ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున నిధులు కేటాయించింది. ఈ లోగా 2019 ఎన్నికలు రావటంతో ఎన్నికల కోడ్ కారణంగా ఎక్కడిపనులు అక్కడ నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో వారికి పెదకాకానికి చెందిన విఆర్ఓ సంస్థ సహకరించింది. ప్రభుత్వం కేటాయించిన నిధులకు తోడు ఆ సంస్థ సహకారంతో గృహనిర్మాణం 2020 నాటికి పూర్తయింది. ఇక మిగిలింది తాగునీరు, అంతర్గత రోడ్లు, డ్రెయినేజి సదుపాయాలు. వాటి కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి విసిగిపోయారు. వారి అవస్థలు గుర్తించి ఓ స్వచ్ఛంద సేవాసంస్థ ముందుకు వచ్చి తాగునీటి సౌకర్యం కల్పించినా అధికారులు సహకరించటంలేదని కాలనీ వాసులంటున్నారు. సైడు కాల్వలు లేకపోవటంతో ఇళ్లల్లో వివిధ అవసరాల నిమిత్తం వాడుకున్న నీరు అక్కడికక్కడే ఇంకి, భూగర్భజలాలు కలుషితమై తాగునీటి ఇబ్బందులు ఎదుర య్యాయి. వర్షాకాలం వస్తే అంతా నీరే. వర్షపునీరు బయ టకు పోయే మార్గం లేదు. రోడ్లు లేవు. గతంలో రోడ్లకోసం తూతూ మంత్రంగా గ్రావెల్ తోలి వదిలేశారు. ఇప్పటికీ నిర్మాణానికి చర్యలూ లేవు.

ఆదుకున్న పీపుల్ ఇన్ నీడ్ ఫౌండేషన్

వికలాంగుల కాలనీలో తాగు నీటి సమస్యపై పీపుల్ ఇన్ నీడ్ ఫౌండేషన్ స్పందించింది. కాలనీలో 5 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు నీటి ట్యాంకులు ఏర్పాటు చేసింది. వాటిలో నీటిని నింపేందుకు మోటార్లను ఏర్పాటు చేసింది. కాలనీలో సైడు కాల్వలు, రోడ్ల నిర్మాణానికి ఇబ్బంది లేకుం డా ఇంటింటికి పైప్‌లైన్ ద్వారా కుళాయిలను ఏర్పాటు చేసింది. అయితే విద్యుత్ సరఫరానిచ్చేందుకు గ్రామ పంచాయితీ నిరాకరించింది. విద్యుత్ సరఫరా పంచాయితీ భారంగా భావిస్తోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో స్వచ్ఛంద సంస్థ దాతృత్వం నిరుపయోగమవుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ క్రమంలో ఇటీ వల కాలనీవాసులు పిజిఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



కాలనీ వాసులతో గుంటుపల్లి ఉదయ కిరణ్

కనీసం తాగునీటి సమస్య పరిష్కరించాలి

కాలనీ ఏర్పాటు చేసి సౌకర్యాలు మరిచారని స్వశక్తి చేయూత వికలాంగుల హక్కుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జి.ఉదయకిరణ్ అన్నారు. ఇక్కడ ప్రధాన సమస్య తాగునీరు. పీపుల్ ఇన్ నీడ్ పౌండేషన్ సహకారంతో, పంచాయతీ సిబ్బంది మార్గదదర్శకాలతో పైప్‌లైన్, కుళాయిలు, వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసు కున్నాం. మోటార్లకు విద్యుత్ సరఫరా ఇవ్వటానికి పంచాయతీ అధికారులు భారంగా భావిస్తున్నారు. కాలనీ ఏర్పడి పదేళ్లవుతున్నా తాగునీటి సౌకర్యం కల్పించటంలో అధికా రులు చొరవ చూపలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.



నిరుపయోగంగా స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన ట్యాంకు

కనీస వసతులు లేవు



కాలనీలో కనీస సౌకర్యాలు లేవు. తాగునీరు, రోడ్లు, సైడు కాల్వలు అవసరం. బట్టలు ఉతుక్కున్నా, అంట్లు తోముకున్నా, స్నానాలు చేసినా ఆ నీరు బయటకు పోయే మార్గం లేదు. పంచాయతీ అధికారులు ఇంకుడు గుంతలు తవ్వుకోమని చెబుతున్నారు. కానీ వర్షాకాలం వస్తే ఇళ్లల్లోకి నీరు చేరతాయి. కాలనీకి వచ్చే డొంక బురదమయం కావటంతో అందరం కలిసి చిప్స్ తోలించుకున్నాం. ఇక వాడుకునే నీటికి చేతి పంపులు ఉపయోగిస్తాం. తాగునీటి పరిస్థితి ఏమిటి? దూరం నుంచి మోసుకోవాలంటే వికలాంగులకు సాధ్య పడదు. అధికారులు కనికరించాలి.

- పులివర్తి నాగమల్లీశ్వరి, వికలాంగురాలు

సర్పంచ్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటాం

నేను ప్రస్తుతం ఇన్‌ఛార్జి కార్యదర్శిగా ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. పిజిఆర్ఎస్‌లో కాలనీ వాసులు ఫిర్యాదు చేసిన తరువాతే కాలనీలో తాగునీటి సమస్య నా దృష్టికి వచ్చింది. దీనిపై సర్పంచ్‌తో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

- కిషోర్, సెక్రటరీ(ఇన్‌చార్జి) కోపల్లె.

చంద్రబాబు దృష్టి పెడితే వైసిపి గల్లంతే

శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు



నూతన చైర్మన్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గత పాలకుల చేతగాని నిర్ణయాలతో గ్రామాలను అభివృద్ధికి దూరం చేశారని, అలాంటి వారిని ఊళ్లలోకి రాకుండా బుద్ధి చెప్పాలని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిలకలూరిపేట మండలం గణపవరం, కొమరవల్లిపాడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంస్థ సొసైటీ నూతన ఛైర్మన్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆదివారం మాట్లాడారు. గణపవరం సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పెంట్యాల శేషయ్యను, కొమరవల్లిపాడు సొసైటీ ఛైర్మన్ కోడె హనుమంతురావును ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం బహిరంగ సభలో గ్రామస్తులు సొసైటీ కార్యవర్గ సభ్యులు, రైతుల్ని ఉద్దేశించి ప్రత్తిపాటి మాట్లాడారు. జగన్ చేసిన తప్పులు, మోసాలు, పార్టీ నేతల దుర్మార్గాల వల్ల జరిగిన నష్టం ప్రజ లు తెలుసుకోవాలన్నారు. కొమరవల్లిపాడు సొసైటీలో 29వేలకు పైగా సభ్యులున్నారని, రూ.7 కోట్లకు పైగా పంట రుణాలు మంజూరు చేశారని, రూ.12 కోట్ల వరకు దీర్ఘ కాలిక రుణాలు ఇచ్చారన్నారు. నూతన బ్యాంక్ భవనం నిర్మించే వరకు, ప్రస్తుతమున్న అద్దె భవనాన్నే సొసైటీ కార్య వర్గం వినియోగించుకోవాలన్నారు. మున్సిపాలిటీలో విలీన మైన గ్రామాల్ని తిరిగి పంచాయతీలుగా కొనసాగేలా చర్యలు తీసుకుందన్నారు. గణపవరంలో ప్రతి నెలా రూ.కోటి వరకు పింఛన్లే అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలు అనుభవించేవారంతా పార్టీలకతీతంగా మంచి చేసే వారికి మద్ధతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నెల్లూరి సదాశివరావు, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, బీజేపీ నాయకులు జయరామిరెడ్డి, నాదెండ్ల మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, రూరల్ మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, గంగా శ్రీనివాసరావు, రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల రమణ, సొసైటీ చైర్మన్లు నల్ల మోతు హరిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు వీరరెడ్డి, మద్దు మలా రవి, కెల్లంపల్లి ఆచయ్య, వలేటి హిమవంతరావు, జాన్‌పాల్, గాలిబుచ్చయ్య, డైరెక్టర్ పూర్ణె హను మంతరావు, యమర్తి ధర్మారావు, కోడెమణి, బొప్పుడి.చంద్ర, గంజి శ్రీనివాసరావు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - మాచర్ల

రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతత్వంలోని కూటమి ప్రభుత్వం రైతులకు, సామాన్యులకు అన్నివిధాల అండగా నిలుస్తోందన్నారు. పంటలకు మద్దతు ధర దక్కించు కోవాలంటే ప్రతిరైతు ఈ క్రాప్ బుకింగ్ తప్పని సరిగా చేయాలని పిలుపు నిచ్చారు. గత ఏడాది బుకింగ్ చేయకపోవడంతో కందిపంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు. రైతులపై ఉన్న నీటి పన్ను వడ్డీగా చెల్లించాల్సిన రూ.70 కోట్లు మాఫీ చేసిన ప్రభుత్వం రైతుల పక్షపాతిగా వ్యవహరిస్తోందన్నారు. మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రమేయంతో మేజర్, మైనర్ కాలు వల్లో పూడిక తొలగించి సాగు నీటి ప్రవాహానికి మార్గం సుగ మం చేశారని తెలిపారు. పల్నాడు, ప్రకాశం జిల్లాల ప్రజల చిరకాల కోరికైన వరికపూడిశెల నిర్మాణానికి అటవీ శాఖకు రూ.14.81 కోట్లు విడుదలయ్యాయని, ప్రాజెక్టు కు రూ.350 కోట్లు మంజూరు కావడంతో పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. సూపర్‌సిక్స్‌లో మరొక హామీ ఆగస్టు 15 నుండి స్త్రీ శక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తు న్నట్లు పేర్కొన్నారు.

నిరుపయోగంగా భవనం...



పిచ్చిమొక్కలు నించి నిరుపయోగంగా ఉన్న ఆర్ అండ్ బి బంగ్లా స్థలంలో నిర్మించిన భవనం

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణ పరిధిలోని ఆర్ అండ్ బి బంగ్లా స్థలంలో నిర్మించిన ప్రభుత్వ భవనం నిరుపయోగంగా మారింది. 2015 సంవత్సరంలో కోటీ పది లక్షల రూపాయలతో నూతన భవనాన్ని నిర్మించాలని నిధులు మంజూరు చేశారు. ఆ సంవత్సరంలోనే పనులు ప్రారంభించారు. ఆర్ అండ్ బి స్థలంలో గతంలో గెస్ట్ హౌస్ ఉండేది. అది పాడైపోవడంతో నూతన భవనాన్ని నిర్మించి సద్వినియోగం చేసుకోవాలని ఆలోచనతో రాష్ట్రం విడిపోయిన తర్వాత టిడిపి ప్రభుత్వం అధికారులకు వచ్చిన సంవత్సరంలో భవనానికి నిధులు మంజూరు చేశారు. భవన నిర్మాణం ఆలస్యంగా జరిగింది. 2019 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన వైసీపీ ప్రభుత్వం ఈ భవనాన్ని గురించి పట్టించుకోలేదు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఉన్నప్పుడు అధికారి ఇల్లు కూడా ఇక్కడే ఉండేది. ఇప్పుడు ఆర్ అండ్ బి అధికారులు కూడా ఇక్కడ ఉండడం లేదు. కేవలం వాచ్‌మెన్ మాత్రమే రేకుల షెడ్డు చేసుకొని ఉంటున్నారు. భవనాన్ని పూర్తిగా నిర్మాణం చేయలేదు. ఇంకా చేయాల్సిన పని చాలా ఉంది. 10 శాతం పనిని పూర్తి చేసి ఈ భవనాన్ని ప్రభుత్వం ఉపయోగించుకోవచ్చు. మరలా రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా దీని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఈ స్థలం పిచ్చి మొక్కలతో నిండి ఉంది. అధికారులు స్పందించి మూడు ఎకరాలు పైనున్న ఈ స్థలములో అనేక భవనాలను నిర్మించి ప్రభుత్వం ఉపయోగించుకోవచ్చునని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు. మంత్రి నారా లోకేష్ ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యే గెలిచి ఉన్నారు. బైపాస్ రోడ్‌లో అనేక ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉంటున్నాయి. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వం ఈ స్థలంలో ఉన్న భవనాన్ని పూర్తి చేసి, మిగిలిన స్థలంలో కూడా భవనాలు కట్టే అవకాశం ఉంది.



నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

అనధికార కట్టడాలను ఉపేక్షించం

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అనధికార నిర్మాణాలను నోటీసులు ఇచ్చి కూల్చివేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారుల్ని ఆదేశించారు. నిర్దేశిత ప్లాన్ లేకుండా, నిబంధనలు పాటించకుండా జరుగుతున్న నిర్మాణాలను ఉపేక్షించబోమని అన్నారు. కమిషనర్ ఆదివారం అరండల్‌పేట, గుంటూరు వారితోట ప్రాంతాల్లో అనధికార కట్టాడాలు, బ్రాడీపేట, పట్టాభిపురం మెయిన్ రోడ్, జేకేసి కాలేజి రోడ్ ప్రాంతాల్లో రోడ్, డ్రైన్ ఆక్రమణలపై తీసుకోవాల్సిన చర్యలపై పట్టణ ప్రణాళికాధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జిఎంసి నుండి నిర్దేశిత భవన నిర్మాణ ప్లాన్ తీసుకోకుండా, ప్లాన్‌కు భిన్నంగా నిర్మాణాలు చేస్తే పట్టణ ప్రణాళిక అధికారులు సదరు నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చి, చట్ట ప్రకారం కూల్చి వేయాలన్నారు. అరండల్‌పేట, గుంటూరువారి తోట ప్రాంతాల్లో అనధికారకట్టాడాలను గమనించి పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ ప్లాన్ మంజూరుకు అనేక నిబంధనలను సరళతరం చేసినప్పటికీ ప్లాన్ తీసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉండే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. సచివాలయం పరిధిలో అనధికార, అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే పర్యవేక్షణ చేయాల్సిన సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, అధికారులు ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసి, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శంకర్ విలాస్ వంతెన పనులు దృష్ట్యా ఈ నెల 9 నుండి ప్రస్తుతం ఉన్న వంతెన కూల్చివేత పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ట్రాఫిక్ ప్రత్యామ్నాయంగా ఉన్న రోడ్లు, డ్రైన్ల ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దఅష్టి సారించామన్నారు. పర్యటనలో ఏసిపి రెహ్మాన్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొనారు.

నేడు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రాక

ప్రజాశక్తి - తుళ్లూరు

గ్రామీణ పేదరిక నిర్మూలన, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం తాళ్లాయపాలెం రానున్నారు. మండలంలోని మందడం శివారు గ్రామమైన తాళ్లాయపాలెంలో ఉదయం 8 గంటలకు జరిగే సుపరిపాలన - తొలిఅడుగు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో కలిసి మంత్రి పాల్గొననున్నారు.

కేఎల్‌యులో స్కిల్ పలావర్ ప్రారంభం



మాట్లాడుతున్న విద్యార్థినులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీ, తన స్కిల్ డెవలప్‌మెంట్ డివిజన్ ఆధ్వర్యంలో విద్యార్థుల పరిశ్రమ అనుసంధానాన్ని పెంపొందిం చేందుకు రూపొందించిన స్కిల్ పలావర్ అనే ప్రాజెక్ట్-ఆధారిత లెర్నింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రారంభించినట్లు వర్శిటీ స్కిల్ డెవలెప్ మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బి-టెక్, బిసిఎ, ఎంసిఎ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించారని తెలిపారు. స్పెషలైజేషన్ ప్రొఫెషనల్ ఎలక్టివ్‌లు, ఇండస్ట్రీ-అలైండ్ స్కిల్ కోర్సులకు అనుసంధానంగా హ్యాకథాన్‌లను విద్యా విధానంలో భాగస్వామ్యం చేయడం ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవంతో కూడిన పరిశ్రమ అనుకూల నైపుణ్యాలును అందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని స్పష్టం చేశారు. స్కిల్ పలావర్ మూడు దశల విధానాన్ని అనుసరిస్తుందన్నారు. లెర్నథాన్ పరిశ్రమ నిపుణుల చేత యథార్థ సమస్యలపై ఇంటరాక్టివ్ సెషన్లు. వర్చువల్ రివ్యూలు సెమిస్టర్ మధ్యలో డొమైన్ నిపుణుల ద్వారా ప్రోగ్రెస్ ఈ వాల్యుయేషన్ చేయించడం అని చెప్పారు.

హ్యాకథాన్, ఓపెన్ హౌస్: తుది దశ ప్రత్యక్ష డెమో, పరిష్కారాల ప్రదర్శన. స్కిల్ పలావర్ ఫేజ్-1 లో శనివారం సాయంత్రం నుండి ఆదివారం మధ్యాహ్నం వరకు లెర్న్ థాన్ నిర్వహిం చారు. ఈ ఫేజ్-1లో సుమారు 1650 మంది ప్రీ-ఫైనల్ ఇయర్ విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమ నిపుణుల మెంటరింగ్: ఈ లెర్న్ థాన్ లో ప్రముఖ పరిశ్రమ నిపుణులు జి. అనిల్ కుమార్ (సిస్కో), పి. తత్తమ్మదొర (ఐబిఎం), జి. నాగ సాయి రామ్ (ఆన్సిస్), అనీష్ (ఆద్యా స్కిల్స్) తదితరుల పాల్గొని విద్యార్థులకు యథార్థ సమస్యల సాంకేతిక అవరోధాలపై వివరణాత్మక శిక్షణ ఇచ్చారు. డెవలప్‌మెంట్ వ్యూహాలను రూపొందించడంలో మార్గదర్శనం చేశారు. కార్యక్రమ మార్గదర్శకులుగా ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రామకఅష్ణ రావు కన్వీనర్‌గా లెర్నింగ్ హ్యాకథాన్‌ను దగ్గరుండి నడిపించారు. ఈ సందర్భంగా స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ. శ్రీనాథ్ మాట్లాడుతూ స్కిల్ పలావర్ అనేది విద్యార్థుల్లో స్వీయ అభ్యాసం ద్వారా బృందాత్మక పని విధానమని తెలిపారు. ఈ కార్యక్రమానికి వర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పి.ఎస్.వర్మ, ప్రొఫెసర్ వీసీలు డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు శాశ్వత మార్గదర్శకత్వం అందించారు.

హోమియో వైద్యంతో మంచి ఫలితాలు : డాక్టర్ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి - గుంటూరు

హోమియోపతి వైద్య విధానం సమగ్రమైనదని, దీర్ఘకాలిక వ్యాధులకు ఈ విధానంలో మంచి ఫలితాలు చాలా త్వరితంగా వస్తున్నాయని ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ కోటపాటి నాగేశ్వరరావు అన్నారు. అవగాహన ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. సభలో డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ విధానంలో వ్యాధిని సమూలంగా నిర్మూలిస్తామని, సహజ సురక్షిత వైద్యంగా హెూమియో ఆదరణ పొందుతుందని చెప్పారు. ఇతర వైద్య విధానాలలో నయం కాని చాలా దీర్ఘకాలిక వ్యాధులు హోమియోలో నయం అవుతుండటంతో కాలక్రమేణా వైద్య విధానం బహుళ ప్రజాదరణ పొందుతుందని అన్నారు. ప్రకృతిలో లభించే మూలికల నుండి తయారు చేసే హెూమియో మందుల వలన సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని మొత్తం మందులు, వైద్య ఖర్చు కూడా తక్కువని, ఈహెూమియో వైద్యం సురక్షితమైన సహజమైన వైద్య విధానమని అన్నారు. డెంగ్యూ, మలేరియా లాంటి అంటువ్యాధులకు హోమియో మందులే పరిష్కారంగా ఆధునిక వైద్యులు కూడా అంగీకరిస్తున్నారన్నారు.ఇటీవల మన రాష్ట్రంలో వచ్చిన మెదడువాపు వ్యాధి, కంటి కలక, చికున్ గున్యా, డెంగ్యూ జ్వరాలు వంటి వ్యాధులకు హోమియో మందులు ఏ విధంగా పనిచేశాయో ప్రభుత్వ పెద్దలతో సహా అందరికీ తెలిసిందన్నారు. సర్జరీ అవసరమైన కేసులు తప్ప మిగతా అన్ని వ్యాధులకు హోమియో మందులు అద్భుతంగా పనిచేస్తున్నాయని అన్నారు. పరిశీలన, అనుభవం, పరిశోధన ద్వారా అభివఅద్ధి చెందిన హోమియో వైద్యం సమగ్రమైనదని సంపూర్ణమైనదని చెప్పారు. వ్యాధి మూల కారకాన్ని పరిష్కరించడం ద్వారా రోగులకు లోపల నుండి చికిత్స చేయడం హెూమియోవిధానమని, హెూమియో బాహ్య లక్షణాలను అదుపులో పెట్టటానికి ప్రయత్నించదని, బయటకు కనిపించే లక్షణాలకు మూలహేతు ఏదో వాటి మీద హెూమియో మందులు పనిచేస్తాయన్నారు. హెూమియో వైద్యంపై అపోహలు విడనాడాలని మందులు వేసుకునే ముందు ఒక అరగంట వేసుకున్న తర్వాత ఏమీ తినకుండా త్రాగకుండా ఒక అరగంట ఉంటే మందులు బాగా పనిచేస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావును అవగాహన సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో జీవన సంద్ర అధ్యక్షులు సి .కృష్ణారావు, అవగాహన సంస్థ సభ్యులు చలమారెడ్డి గూడవల్లి నాగేశ్వరరావు ప్రసంగించారు.



పక్షోత్సవాలలో రైల్వే సిబ్బంది, డాక్టర్ శారద

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత అభియాన్ పక్షోత్సవాలు

ప్రజాశక్తి - తెనాలి

స్వచ్ఛత అభియాన్ పక్షోత్సవ కార్యక్రమం స్థానిక రైల్వే స్టేషన్లో ఆదివారం నిర్వహించారు. భారతీయ రైల్వేలో ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా స్వచ్ఛత అభియాన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో 'స్వచ్ఛత పరిశుభ్రత' గురించి ప్రయాణికులకు ప్రముఖ వైద్యులు డాక్టర్ డి.శారద అవగాహన కల్పించారు. అనారోగ్యం సంభవించినప్పుడు బాధపడటం కంటే అది రాకుండా చూసుకోవడం ముఖ్యమని, ముందు జాగ్రత్త చర్యలతో ఎన్నో రోగాలను అరికట్టవచ్చునని ఆమె చెప్పారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ రమణ, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ సృజన, హెల్త్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, పిడబ్ల్యుఐ, రైల్వే ఎఎస్‌ఐ పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి గడ్కరీకి వినతిపత్రం అందజేస్తు బీసీ నాయకులు

ఓబీసీల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వానికి తెలపండి

ప్రజాశక్తి - మంగళగిరి

ఓబీసీల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వానికి తెలపాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేసేందుకు వచ్చిన కేంద్ర జాతీయ రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా కేసన విలేకరులతో మాట్లాడుతూ ఈసారి కేంద్రం జరిపే జనగణనతో పాటు సమగ్ర కుల గణనకు నిర్దిష్ట మార్గదర్శకాలతో చట్టబద్ధత కల్పించాలన్నారు. చట్టసభలలో ఓబీసీలకు జనాభా దామాషా మేరకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడారు. ప్రధాన రహదారుల నిర్మాణాలకు తగినన్ని నిధులు కేటాయించి, త్వరితగతిన పూర్తి చేయాలని గడ్కరీని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అలరించిన పొట్లూరి చార్మి నృత్య ప్రదర్శన



చార్మిని అభినందిస్తున్న జాగర్లమూడి మురళీమోహన్

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక జెకెసి కళాశాల ఆడిటోరియంలో అమెరికా న్యూజెర్సీ నగ రానికి చెందిన పొట్లూరి చార్మి భరతనాట్యం తొలి ఆరంగేట్రం నృత్య ప్రదర్శన ఆదివారం అలరించింది. ఆధ్యాత్మ స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ శిక్షకురాలు కావ్య శేఖరన్ నేతఅత్వంలో పుష్పాంజలి, ధిల్లాన, గజానన, దశావతార్, మయూరాష్టకం, దేవనామం వంటి తొమ్మిదికి పైగా నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ ఛార్మికి జ్ఞాపిక అందించారు. భరతనాట్యం దేశ విదేశాలలో కీర్తి గడించటంతో పాటు ఎన్నారై పొట్లూరి చార్మి అద్భుత ప్రదర్శనలు స్ఫూర్తిదాయక మన్నారు. కార్యక్రమంలో చార్మి తల్లిదండ్రులు చైతన్య, జయప్రకాష్, ప్రిన్సిపాల్ పరుచూరి గోపీచంద్, కార్యక్రమ నిర్వాహకురాలు సిహెచ్.సుశీల, భరతనాట్య అభిమానులు, నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



డిగ్రీలు అందజేస్తున్న రామ్‌కుమార్, లావు రత్తయ్య

దేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చండి

ఐఐఎం రాయ్‌పూర్ మాజీ డైరక్టర్ డాక్టర్ రామ్‌కుమార్ కాకాని

ప్రజాశక్తి - గుంటూరు

భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చడం, సమ్మిళిత, స్థిరమైన వృద్ధిని నిర్ధారించడం వంటి లక్ష్యాలు మన ముందున్నాయని ఐఐఎం రాయ్‌పూర్ మాజీ డైరక్టర్ డాక్టర్ రామ్‌కుమార్ కాకాని అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్శిటీలో ఆన్‌లైన్ విద్య, ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్‌లో ఎంసీఏ, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు 3వ స్నాతకోత్సవం, పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ మొదటి స్నాతకోత్సవాన్ని ఆదివారం వర్సిటీ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడలోని ఆర్‌ఆర్ స్పోర్ట్స్ ఫౌండర్ గల్లా రాధారాణికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యంపైనే దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. కృషితో ఏ రంగంలోనైనా ఋషులుగా మారొచ్చని చెప్పారు. సమస్యల గుర్తింపుతోనే నూతన ఆవిష్కరణలు సాధ్యం అవుతాయని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తెలిపారు. విద్యార్థులు ముందుగా సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాలని, ఆ సమస్యల పరిష్కారానికి నూతన ప్రాజెక్టులను చేపట్టి సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలని పిలుపునిచ్చారు. గతంలో బస్ టికెట్ కొనుగోలు విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమ్యస్యలను గుర్తించిన విజ్ఞాన్ విద్యార్థులు వాటికి పరిష్కారంగా రెడ్‌బస్, అభిబస్ వంటి అంకురాలను నెలకొల్పారని వివరించారు. విద్యార్థులు తమ దృక్కోణాన్ని విభిన్నంగా మార్చుకోవాలని, టెక్నాలజీని ఉపయోగించుకోవాలని, అప్పుడే గొప్ప ఆవిష్కరణలు చేయగలరని పేర్కొన్నారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్యార్థులందరికీ నిరంతర అభ్యాసం అవసరమని, అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరగలరని అన్నారు. అనంతరం 1191 మంది విద్యార్థులకు డిగ్రీలు అందజేశారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రమణకు సువర్ణ కంకణధారణ, గద్దర్ అవార్డు అందజేస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

రమణకు సువర్ణ కంకణ ధారణ, గద్దర్ అవార్డు ప్రదానం

ప్రజాశక్తి - గుంటూరు

ప్రజా గాయకుడు రమణకు సువర్ణ కంకణధారణ, గద్దర్ అవార్డు ప్రదాన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. పాటే ప్రాణంగా పాతికేళ్లుగా జీవన గమనాన్ని సాగిస్తున్న ప్రజావాగ్గేయకారుడు పి.వి.రమణ తెలుగు సాంస్కృతికోద్యమ జయకేతనమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. సంస్కృతి (సంగీత, సాహిత్య, నృత్య, నాటక సంస్థ), అమరావతి ఉద్యమ సమితి జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు పి.వి.రమణకు తన పాటల ప్రస్తానం 25 సంవత్సరాలుగా సాగిస్తున్న సందర్భంగా స్థానిక బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో రమణ వెంకటలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షులు పి.వి.మల్లికార్జునరావు సభకు అధ్యక్షత వహించగా, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ప్రముఖ కవి జయరాజ్ మాట్లాడుతూ ఉద్యమాలకు ఊపిరిలూదేది ప్రజా కళాకారు లేనన్నారు. ప్రజల హృదయాలను తన గానంతో తట్టి లేపిన ప్రజా గాయకుడు రమణ అని ప్రశంసించారు. కార్యక్రమంలో సర్రాజు బాలచందర్, డాక్టర్ పోలే ముత్యం, బాలస్వామి, విప్లవ కుమార్, నూతలపాటి కాళిదాసు, పలువురు కవులు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు గాయకులు ఆలపించిన చైతన్య గీతాలు అలరించాయి.

ఉద్యాన పంటల సాగుకు రాయితీలు

ఆయిల్ ఫాం సాగుకు ప్రోత్సాహం - ప్రజాశక్తితో జిల్లా ఉద్యాన అధికారి ఇంటూరి వెంకట్రావు



ఉద్యాన పంటలతో రైతులు లాభాలు గడించవచ్చునని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఇంటూరి వెంకట్రావు తెలిపారు. ఉద్యాన పంటల సాగులో రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. సమగ్ర యాజమాన్య విధానాలు అవలంభించి ఉద్యాన శాఖ రాయితీలు సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

- ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులకు ఇస్తున్న రాయితీలు?

14 రకాల పండ్ల తోటలకు, పూల తోటలకు 40 శాతం రాయితీ, కూరగాయల తోటలు, ఉల్లి,వెల్లుల్లి సుగంధ, ఔషధ మొక్కలకు 50 శాతం రాయితీలు ఇస్తున్నాం. ఉద్యాన శాఖ ద్వారా కూరగాయలు, పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెంచే విధంగా రైతులకు కూరగాయల సాగుకు వివిధ పద్ధతుల ద్వారా రాయితీలు వర్తింపచేస్తున్నాం.

జిల్లాలో సాగు అవుతున్న ఉద్యాన పంటలు?

పల్నాడు జిల్లాలో గత ఏడాది 1.21 లక్షల ఎకరాలలో ఉద్యాన పంటలు పంటలు సాగు చేస్తారు. 1,10,500 లక్షల ఎకరాలలో మిర్చి, 5950 ఎకరాలలో పండ్ల తోటలు, 2150 ఎకరాలలో కూరగాయల తోటలు, 1100 ఎకరాలలో పసుపు, 1700 ఎకరాలలో పూల ఇతర ఉద్యాన పంటలు సాగు చేశారు.

ఏయే పండ్ల తోటలకు రాయితీలు ఉన్నాయి?

మామిడి, తైవాన్ జామ, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, అరటి, బొప్పాయి, డ్రాగన్, అవకాడో, అంజీరా, ఉసిరి, అల్ల నేరేడు, చింత తోటల పెంపకానికి ఒక్కో రైతుకు 2 హెక్టార్ల వరకు 40 శాతం రాయితీలు ఉన్నాయి. పూల తోటలకు 40 శాతం, కూరగాయల సాగుకు,మొక్కలు చనిపోయిన పాత పండ్ల తోటల రైతులను ప్రోత్సహిం చేందుకు రాయితీలు ఇస్తున్నాం.

ఏయే పథకాలు అందుబాటులో ఉన్నాయి?

ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, జాతీయ నూనె గింజలు ఆయిల్ పామ్ మిషన్, జాతీయ వెదురు మిషన్, ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం పథకాల ద్వారా ఉద్యాన పంటల సాగుకు ముందుకు వచ్చిన రైతులను ప్రోత్సహిస్తున్నాం.

ఆయిల్ పామ్ సాగు ఎలా ఉంది?

పల్నాడు జిల్లాలో గత ఏడాది అమరావతి, ఈపూరు మాచవరం, ఈపూరు, రాజుపాలెం, నాదెండ్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్లలో 1100 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయగా ఈ ఏడాది మరో 15 మండలాలను ఎంపిక చేశారు. ఆయిల్ పామ్ పంట సాగుతో రైతుల ఆదాయం మరింత పెరుగుతుంది. రైతులు వరి, మొక్క జన్న పత్తి పంటల్లో స్వల్పకాలికంగా ఆదాయాన్ని పొందుతున్నా దీర్ఘకాలికంగా రైతు ఆదాయం పెరగాలంటే ఆయిల్ పామ్ సాగు ద్వారా సాధ్యమవుతుంది. సొంత నీటి వనరులు కలిగిన రైతులు రాయితీపై డ్రిప్ ఏర్పాటు చేసుకుంటే ఉచితంగా మొక్కలు పంపిణీ చేయడం జరుగుతుంది.

ఆయిల్ పామ్ సాగు లక్ష్యం,రాయితీలు, మార్కెటింగ్ సదుపాయాలు?

ఈ ఏడాది 3300 ఎకరాల ఆయిల్ పామ్ లక్ష్యం కాగా 650 ఎకరాలలో ఇప్పటి వరకు సాగు చేశారు. రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తాం. ఆయిల్ పామ్ తోటలో అంతర పంటలు సాగుకు హెక్టారుకు మరో మొక్కలు, విత్తనాలు అందిస్తాం. ప్రస్తుతం టన్నుకు జూన్ నుండి రూ 17390 కాగా అక్టోబర్ నుండి రూ 19050/- చెల్లించేలా కమిటీ కంపెనీలతో ఒప్పందం జరిగింది. విక్రయించిన 14 రోజులలో నగదు చెల్లింపులు జరుగుతుంది. పల్నాడు జిల్లాలో ఆయిల్ పంప్ సాగు విస్తీర్ణం పెరిగితే పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు ఉన్నాయి.



అనుమతులు లేని నర్సరీలపై చర్యలు?

పల్నాడు జిల్లాలో 395 షేడ్ నెట్ నర్సరీలు, పూర్తి స్థాయిలో అనుమతులు పొందిన 500 లకు పైగా ఓపెన్ బెడ్ నర్సరీలు ఉన్నాయి. నర్సరీలపై నిరంతరం నిఘా ఉంది. రైతులకు గుర్తింపు పొందిన కంపెనీ మిర్చి విత్తనాలతో నారు పెంచాలని బ్యాచ్ నెం. లాట్ నెం. మొలకశాతం తదితర వివరాలు మొత్తం క్షేత్రం పరిశీలనలో, రికార్డులలో ఒకే విధంగా ఉండేలా చూడడం వంటి నిబంధనలు ఉన్నాయి. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాం.

మిషన్ గ్రీన్ గుంటూరుకు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం కీలకం

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ చేపట్టిన మిషన్ గ్రీన్ గుంటూరులో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం కీలకమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కమిషనర్ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మిషన్ గ్రీన్ గుంటూరుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల సూచనలు, సలహాలతో పర్యావరణహిత గుంటూరు కోసం కృషి చేస్తామని చెప్పారు. మిషన్ గ్రీన్ గుంటూరు కార్యక్రమంలో భాగంగా ఈ సీజన్‌లో దశలవారీగా 5 లక్షల మొక్కలను నాటడం ద్వారా పచ్చదనం పెంపు, పారిశుధ్య పనులలో మెరుగుదల, వ్యర్థాలను తడిపొడిగా వేరు చేసి తీసుకోవడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేదం, నగరంలోకి వచ్చే ప్రధాన మార్గాలు, జంక్షన్లు, ఐలాండ్స్, పార్కులు, డివైడర్లపై పచ్చదనం పెంపు వంటి చర్యలు పగడ్బందీగా తీసుకొబోతున్నామని



మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

తెలిపారు. మిషన్‌గ్రీన్ గుంటూరుని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ఎకాలజీ ప్రొటెక్షన్ సర్వీస్ వ్యవస్థాపక అధ్యక్షులు చెలికాని సీతారామయ్య, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, సెక్రెటరి కె.సతీష్, ఐటిసి ఫినిష్ మేనేజర్ నారాయణ, పర్యావరణ విద్య నోడల్ అధికారి తిరుపతిరెడ్డి, జిఎంసి సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కన్సల్టెంట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

వలస కార్మికుల పిల్లల సంఖ్యపై అయోమయం



రోడ్డుపై వలస కార్మికుల పిల్లలు..

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో వలస కార్మికుల పిల్లల సంఖ్యపై అయోమయం నెలకొంది. రాజధాని నిర్మాణ పనులకు అస్సాం, జార్కండ్, బీహార్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుంచి కార్మికులు రాజధాని అమరావతికి వచ్చారు. వీరితో పాటు బడికి వెళ్లే పిల్లలు గత్యంతరం లేక చదువు మధ్యలో వదిలేసి తల్లిదండ్రులతో కలిసి రాజధాని ప్రాంతానికి వచ్చారు.వీరిని గుర్తించి స్థానిక పాఠశాలల్లో ,లేదా ప్రత్యేకంగా పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యాబోధన చేయాలి. అయితే వలస వచ్చిన కార్మికుల పిల్లలు ఎంతమంది అన్నది విద్యా శాఖాధికారులకే తెలియడం లేదు. వలస కార్మికుల పిల్లలను బడుల్లో చేర్పిస్తున్నాం.. ఇంగ్లీష్‌లో చదువు చెబుతున్నామని అంటున్నారే గానీ పిల్లల సంఖ్యపై మాత్రం స్పష్టత ఇవ్వడం లేదు. మండల విద్యాశాఖాధికారి రాజశేఖర్ సైతం రాజధానిలో వలస కార్మికుల పిల్లల సంఖ్య ఎంతనేది తనకు తెలియదని చెప్పడం గమనార్హం. రాజధాని నిర్మాణ పనుల నిమిత్తం వివిధ రాష్ట్రాల నుంచి 15వేల మంది కార్మికులు వచ్చారని, మున్ముందు వారి సంఖ్య మరింత పెరుగుతుందని ప్రభుత్వం చెబుతోంది. ఈ లెక్కల ప్రకారం వలస కార్మికుల పిల్లల సంఖ్య తక్కువేమీ కాదని అర్థమవుతోంది. కార్మికులు వారి పిల్లల వివరాలు వెల్లడించాల్సి ఉంది. కానీ ఆవిధంగా జరగక పోవడం వల్లనే పిల్లల సంఖ్యపై అయోమయం నెలకొందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పాఠశాలల్లో చేర్పించాలి : సిపిఎం

చదువుకు దూరం కాకుండా వలస కార్మికుల పిల్లలందరినీ స్థానికంగా ఉన్న పాఠశాలల్లో లేదా ప్రత్యేక పాఠశాలలో చేర్పించాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలూ ప్రభుత్వం తీసుకోవాలని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి కోరారు. ఇప్పటివరకు ఎంతమంది పిల్లలను గుర్తించారు, బడిలో చేర్పించారనే వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించాలని అన్నారు. పిల్లలను బడిలో చేర్పించే విషయంలో ప్రభుత్వం, కాంట్రాక్ట్ సంస్థల నిర్లక్ష్యం కనబడుతోందని అన్నారు. పిల్లలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆ దిశగా రాజధానిలో వలస కార్మికుల పిల్లల విద్యకు తగిన ప్రోత్సాహం అందించాలన్నారు.



నాగార్జునకొండకు భారీగా తరలివచ్చిన పర్యాటకులు

నాగార్జునకొండలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జున కొండను పర్యాటకులు ఆదివారం భారీగా తరలివచ్చారు. పర్యాటకులు కేరింతలు కొడుతూ లాంచీ లలో నాగార్జున కొండకు వెళ్లారు. కొండలోని మ్యూజియంలో ఉన్న బుద్ధిని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధ శాల, స్నానాల గట్టు, బోది వృక్షం చూసి తన్మయం చెందారు. అనంతరం ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. లాంచీల ద్వారా 2,12,750 ఆదాయం పర్యాటక శాఖకు సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.



రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మద్దినేని సుధాకర్

రక్తదాన ప్రాధాన్యతను యువత గ్రహించాలి

ప్రజాశక్తి - గుంటూరు

దేశంలో ప్రమాదాల బారిన పడుతున్న కోట్లాది మందిని ఆదుకోవడంలో రక్తదానం ప్రధాన భూమిక పోషిస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాతీయ సేవా పథకం అధికారి మద్దినేని సుధాకర్ అన్నారు. సరిపడినంత రక్తం అందక అనేక మంది మృత్యువాత పడుతున్నారని, రక్తదానం ప్రాధాన్యతను విద్యార్థులు, యువత గ్రహించాలని కోరారు. స్థానిక బ్రాడీపేట అపెక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీషు ఆధ్వర్యంలో డిఎస్ఆర్ ఫ్రెండ్స్, రెయిన్‌బో బ్లడ్‌బ్యాంక్ సహకారంతో స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని వందమందికిపైగా విద్యార్థులు రక్తదాన శిబిరంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అపెక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ వ్యవస్థాపకులు కొత్తపల్లి నాగేశ్వరరావు, డిఎస్ఆర్ ఫ్రెండ్స్ దామచర్ల శ్రీనివాసరావు, డాక్టర్ నీలిమ ప్రియదర్శిని, రెయిన్‌బో బ్లడ్ బ్యాంక్ నవీన్ చక్రవర్తి, విజేత కాంపిటీషన్స్ వాసుదేవరావు పాల్గొన్నారు.